శ్రీరస్తు

శ్రీ సూరనకృత

# ధనాభిరామము

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సు వారిచేఁ

ప్రకటితము.

All Rights Reserved.

TP
81
Su77D

University of Hyderabad
LIBRARY
Acc. No. 29319
Dated. 14 SEP 87
Hyderabad - 500 134.

PRINTED BY
V. VENKATESWARA SASTRULU
OF V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS, MADRAS.—1950

# పీఠిక

ధనాభిరామమను నీప్రబంధమును రచియించినకవి నూతనకవి సూరన. ఈతఁడు తన్నుగూర్చి గ్రంథములో నిట్లు చెప్పుకొనియున్నాఁడు.

చ. అనువుగ భారతాంబునిధి యందఱకుం దగదీఁద నందులో
ఘనకవితామృతంబు చవిగాంచిన తిక్కనసోమయాజి పా
వనతరమైనయట్టి కులవర్ధనుఁడన్ మహిఁ బేరుగల్గు నూ
తనకవి సూరయాహ్వయుఁడ ధర్మగుణప్రతిపాలనీయుఁడన్.

సీ. విస్తీర్ణవిభవయాపస్తంబసూత్రుఁడ
కాశ్యపగోత్రవిఖ్యాతయశుఁడ
ఘనత ననంతసేనుని మల్లయామాత్య
పౌత్రుఁడ తిప్పయప్రభునిసుతుఁడ
పార్వతీశుభగర్భపాథోనిధికినిసం
పూర్ణచంద్రుఁడ రాజపూజితుఁడను
రాజార్ధశేఖర పూజావిశేషసం
ధానైకచిత్తుఁడ మానధనుఁడ

గీ. భద్రవైభవశ్రీవీరభద్రలబ్ధ
జనితచాతుర్య కావ్యలక్షణవిచిత్ర
విపులవాచాసమగ్రసంవిశదమతిని
సూరయామాత్యతిలకుఁడ సుకవివరుఁడ.

పై పద్యములవలన నీతఁడు తిక్కనసోమయాజి జన్మించిన వంశమున ననఁగా నమాత్యవంశమున జన్మించెననియు, నూతన కవియని బిరుదనామమును ధరించినవాఁడనియు, నాపస్తంబ సూత్ర కాశ్యపగోత్రుఁడనియు, శివపూజాధురంధరుఁడనియుఁ దెలియుచున్నది. వంశవివరము లివి:—

అనంతసేనుఁడు
|
మల్లయ
|
తిప్పయ-పార్వతమ్మ
|
సూరయ -

ఈతఁడు వీరభద్రస్వామి కృపాకటాక్షముచేఁ గావ్య కవితావిశేషములను గ్రహించి ప్రసిద్ధుఁడైనవాఁడు.

## కాలము

ఈ గ్రంథములో రచనాకాలము చెప్పఁబడకున్నను కవిస్తుతినిఁబట్టి యీకావ్యరచనాకాలము నిర్ణయింపవీలగుచున్నది. కవిస్తుతిలో నిట్లు కలదు:—

చ. అలఘుని శబ్దశాసనపదాంకితుఁ దిక్కనసోమయాజి ని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుతు నాచనసోమనార్యు, చె
న్నలరిన చిమ్మపూఁడి యమరాధిపు భాస్కరు రంగనాథునిం
దలతు నపూర్వచిత్రకవితామహనీయసమగ్రచిత్తులన్.

పై కవులలో నీతనికి ముందున్న వారిలో నాచనసోమ యమరేశ్వరులు చివరివారు. ఈకాలము క్రీ. శ. 1360 ప్రాంతము. కావున సూరనయు నాతరువాతికాలమువాఁడని మాత్ర మీకవిస్తుతి తెలుపును. ఇక, క్రీ. శ. 1550 ప్రాంతము వఱకుఁగల కవుల గ్రంథములనుండి పద్యములు సంధానింపబడిన జగ్గన ప్రబంధరత్నాకరములో, సూరన ధనాభిరామమునుండి యీ క్రిందిపద్య ముదాహరింపఁబడినది.*

చ. ఇరువదియాఱుపీఁటఁణము లెన్నఁగ నాలుగువక్ర చేష్టలిం
పరుదుగ నేడు భూమినటన లర్వదినాలుగు దోర్విలాసముల్
సరసతఁ జూపి హంసవృషసామజవాయసశుద్ధసంగతుల్
పరువడి ముట్ట నిల్పె సితపంకజలోచన పాడుచుండఁగన్.

ఇది రెండవయాశ్వాసమున 46-వ పద్యముగాఁ గొలది మార్పుతో నీగ్రంథమందే యున్నది. కాఁబట్టి నూతనకవి సూరన క్రీ. శ. 1360-1550 మధ్యవాఁడని మనకుఁ దెలియు చున్నది. ఇంతకంటె స్పష్టముగా నిర్ణయముచేయుటకు వేఱొక యాధారము గలదు. సూరనకవిత్వమును శ్రీవీరభద్రగురుకటాక్షముచే గ్రహించినాఁడు. ఈవీరభద్రగురుఁడు ముదిగొండ వీరభద్రుఁడు. రత్నశాస్త్రమును రచియించిన భైరవకవి "ముదిగొండ శ్రీవీరేశునకు భక్తచింతామణికి" అని యాగ్రంథ

* చూ. ప్రబంధరత్నావళి - 482 పద్యము. 141 పుట.

ములో చెప్పినాఁడు. భైరవకవి క్రీ. శ. 1440 ప్రాంతము వాఁడు. కాఁబట్టి నూతనకవి సూరనయు, క్రీ. శ. 1450 ప్రాంతమువాఁడనియు పూర్వకవులలో నొకఁడనియు నిశ్చయింపవచ్చును.

## గ్రంథవిషయము

ఈగ్రంథము దాక్షారామభీమేశ్వరునికిఁగృతి. ఇందలికథ గతానుగతికమగు ప్రబంధకథగాక, మానవజీవితముతో సంబంధించినది. మనుష్యునకు రూపము ధనము రెండును నావశ్యకములే యని యిది నిరూపించును. కథసారాంశ మిది "రూపము హెచ్చని మన్మథుఁడును, ధనము హెచ్చని కుబేరుఁడును వాదించి, దాక్షారామక్షేత్రమునఁ దమవాదముల నెగ్గించుకొనుటకు వచ్చిరి. అచ్చట రూపమువల్ల మన్మథుఁడు స్వాధీనపఱచుకొన్నస్త్రీని, ధనమువల్ల కుబేరుఁడు స్వాధీనపఱచుకొనెను. అంతమన్మథుఁడుభీమేశ్వరునిఁబ్రార్థింపఁగా నాతఁడు ప్రత్యక్షమై మానవులకు ధనము రూపము రెండును నావశ్యకములే యని సమాధానపఱచి, వారివాదమును మాన్పెను." కావున నీకృతి కేవలసాంఘికవృత్తమునకు సంబంధించినప్రబంధమనియు, నిట్టి గ్రంథములు మనభాషావాఙ్మయములో కొలఁదిగామాత్రమే యున్నవనియు, నిదియే యీప్రబంధప్రాశస్త్యమనియు నెఱుఁగఁదగియున్నది.

## కవితావిశేషములు - అనుస్మృతులు

తిక్కనసోమయాజిని బేర్కొనుటచేత, నాతని ప్రథమ గ్రంథములలో నొకటియగు విజయసేనమునుండి యీ క్రింది పద్యపాదమును గ్రహించియున్నాఁడు.

తిక్కన:—

సీ. మదనవశీకార మంత్రదేవత దృష్టి
 గోచరమూర్తిఁ గైకొనియె నొక్క
 (ప్రబంధరత్నా. 50 పు. 159 ప.)

సూరన:—

సీ. మదనవశీకారమంత్రరూపము లన
 మెలఁగెడు తొలుకారుమెఱుపు లనఁగ
 (2. ఆశ్వాసము.)

ఈ పద్యమున రెండవపాదమున మొదటిదళమునగల "సీ. నడపాడ నేర్చిన నవకంబు లతలన" అనునది

సీ. నడపాడ నేర్చిన నవకంబు నునుతీగ

అను కేయూరబాహుచరిత్రలోని 5 వ ఆశ్వాసమున గల పద్యపాదమున కనువాదము.

ధనాభిరాముడు:—

ఉ. పువ్విలుకానిఁబోలిన యపూర్వమనోహరమూర్తివాఁడహో
 యొప్పఁడొ కో...అనునది

ఉ. పువ్వులుకానితోడ సరిపోలెడు చక్కదనంబుగల్గువాఁ
    డెవ్వఁడొకో...

అను శ్రీనాథమహాకవి యాంధ్రనైషధకావ్య ద్వితీయాశ్వాసమునుండి గ్రహింపబడినది.

విసుగుపుట్టించువర్ణనలు లేక, చక్కనికథాసరళితో సముచిత శృంగారవర్ణనలతోఁగూడిన యీ ప్రశస్తకృతిని యింతవఱకు ప్రసిద్ధిఁగాంచకుండుటఁజూచి నేఁడు, రెండుమూఁడు ప్రతులచే సరిచేయింపఁబడిన గ్రంథము నాధారముగఁగొని దీనిని ముద్రించి ప్రకటించితిమి. ఆంధ్రమహాజనులెల్లరు నీరసవత్కృతి నాదరింతురుగాత!

ఇట్లు
వావిళ్ల వేంకటేశ్వరులు.

శ్రీ ర స్తు.

# ధ నా భి రా మ ము

పీ ఠి క

శా. శ్రీధాత్రీధరకన్యకారమణు దాక్షిణ్యాంబుధిన్ సర్వలో
కాధారున్ ఫణిరాజకంకణుని చంద్రాకల్పు సర్వజ్ఞు స
ద్బోధానందకరైక భక్తహృదయాంభోజాతవాసున్ వచో
మాధుర్యంబున దక్షవాటిపురి భీమస్వామి చింతించెదన్. 1

చ. ఒసపరి యింద్రనీలములయొప్పు నటించెడి మేనికాంతితో
ముసలగ దాసి శూలకరముద్గరకుంతశరాసనోగ్రప
ట్టిసపటుఖేటకావళివడిన్ దనహస్తమునన్ వెలుంగఁగా
పొసగిన మేటివేలుపని పూని భజించెద వీరభద్రునిన్. 2

ఉ. కోరికమీర పాల్కడలికూఁతునకున్ వలకన్నుగిటి యిం
పారగ ధారుణీసతికి నావలి దాపలికన్నుగీటి తా
వారికి వారిలోపలను వాదముఁ బుట్టఁగజేసి నవ్వుతో
నూరక యుండువిష్ణు జలజోదరు గొల్చెద భక్తితోడుతన్.3

చ. పలుకులబోఁటితోఁ గలసి భావమునం దరలేక నిచ్చలున్
వలపులరాజు కయ్యమున వాడిమిఁ జూపి సుఖాబ్ధి దేలుచున్
కలయ చరాచరంబుల సుఖస్థితిమై సృజియించు ప్రోడయం
న్నలువ దలంచి మ్రొక్కెద మనంబున కోరికె లంకురింఁగన్.4

ఉ. పొందుగ నీశుముందటను బొజ్జగదల్చుచు నాడుచుండగా
విందులు విందు లంచునరవిందదళాయతనేత్ర గౌరి యా
నందముతోడఁ బిల్చినను నవ్వుచు దానెదురేఁగు పార్వతీ
నందను లోకవంద్యు గణనాథుని గొల్చెద నిష్టసిద్ధికిన్. 5

చ. సరసిజసంభవామరులు సన్నుతిసేయ శివుండు దాను భా
సురముగ నొక్కపుత్త్రికను సోలి జగంబులకెల్ల దల్లి యై
విరచితభోగభాగ్యముల విశ్రుతికెక్కిన యాదిశక్తికిఁ
గురుతరమైనయావడఁకు గుబ్బలిపట్టిని గోరి మ్రొక్కెదన్. 6

ఉ. భావజుగన్నతల్లి శివభామినికిం జెలికత్తె భారతీ
దేవికి యత్తగారు గురుతింపగరాని గుణాంబురాశి సం
భావితచంద్రమూర్తి సితపంకజలోచనుకూర్మిరాణి లీలా
విభవోన్నతిఁ బొదలు లచ్చిశుభంబులు మాకు నీవుతన్. 7

ఉ. వీణెయు బొత్త మంకుశము వేడుకతో జపమాల జేతులం
బ్రాణపదంబులై వెలయు భవ్యతనుప్రభనిండి సర్వగీ
ర్వాణులు సన్నుతింపగను వర్ణన కెక్కిన బ్రహ్మరాణికిం
వాణికి మత్తకీరపికవాణికి మ్రొక్కెద కార్యసిద్ధికిన్. 8

చ. దొరయ నఘోరమంత్రనిరతుం బ్రతివాదిమహాంబురాశిని
ష్ఠురబడబానలుం ఘనవిశుద్ధచరిత్రుని శాంతమూర్తి భా
సురనిగమార్థతత్వగుణశోభితదేశికచక్రవర్తి మ
ద్గురుముదిబండ వంశగురుధూర్జటి గొల్చెద నిష్టసిద్ధికిన్. 9

క. పుట్టంబుట్టిమహానది
బుట్టియు సైకతస్థలమునబుట్టి జగంబుల్
నెట్టన బొగడఁగ వెలసిన
యట్టిమహాత్ముల దలంతు నాదిమకవులన్. 10

మ. భవభూతిన్ శివభద్రుమాఘుగలభర్తృన్ బాణున్ సుబంధ్వా
ఖ్యుభా,రవి శ్రీహర్షుని కాళిదాసు భవుహేరంబున్ మయూ
రాహ్వయున్, కవిమిత్రుం జయదేవు మల్హణుని విఖ్యాతుం
బ్రశంసించెద, న్నవశబ్దార్థవిచిత్రకావ్యయుత నానాశాస్త్ర
పారీణులన్. 11

చ. అలఘుని శబ్దశాసనపదాంకితు తిక్కనసోమయాజి ని
శ్చలమతి శంభుదాసు బుధసన్నుత నాచనసోమనార్యు చె
న్నలరిన చిమ్మపూడి యమరేశ్వరు భాస్కరు రంగనాథునిన్
దలతు నపూర్వచిత్రకవితామహనీయసమగ్రచిత్తులన్. 12

చ. చెప్పగలేరు కావ్యము ప్రసిద్ధికి నెక్కగ తారు జెప్పినన్
తప్పులెకాని యొప్పులు పదంబుల గానరు సత్కవీశ్వరుల్
చెప్పిన తప్పులెన్నుదురు సిగ్గు లెఱుంగరు వారి నిందలోఁ
జెప్పగనేటికిం సరకుజేయకుడీసుకవీంద్రు లెన్నడున్. 13

చ. ధర జనవశ్యమై భజన తప్పక యక్కడయొరలేని యొందతే
నిబెల్లొరసినమించుగల్గి కడునొప్పగునెత్తున వన్నెవచ్చియుం
జిరమతి నన్నిదిక్కులను చెల్లుబడై సుకవిత్వ మెప్పుడు
వారపది లేక బంగరవుపూదెవిధంబున నుండి యొప్పుగన్. 14

వ. అని యిష్టదేవతా ప్రార్థనంబును, మద్గురునాథస్తోత్రంబును
పురాతనకవిప్రశంసయు, కుకవినిరసనంబును, సత్కవీశ్వర
వర్ణనంబునుం జేసి మఱియును.

చ. అనువుగ భారతాంబునిధి యొవ్వలికిన్ దగనీది నందులోఁ
ఘనకవితామృతంబు చవిగాంచిన తిక్కయసోమయాజి పా
వనతరమైన యట్టికులవర్ధనుఁడన్ మహిఁబేరుగల్గు నూ
తనకవిసూరనాహ్వయుఁడ ధర్మగుణప్రతిపాలనీయుఁడన్.15

సీ. విస్తీర్ణవిభవయాపస్తంభసూత్రుఁడా
కాశ్యపగోత్రవిఖ్యాతయశుఁడు
ఘనత ననంతసేనుని మల్లయామాత్య
పౌత్రుండ తిప్పన ప్రభునిసుతుఁడ
పార్వతీశుభగర్భ పాథోనిధానసం
పూర్ణచంద్రుఁడ రాజపూజితుఁడను
రాజార్ధశేఖర పూజావిశేషసం
దానైకచిత్తుఁడ మానధనుఁడ
తే. భద్రవైభవ శ్రీవీరభద్రలబ్ధ
జనిత చాతుర్యకావ్యలక్షణ విచిత్ర
విపులవాచాసమగ్రసంవిద్ధమతిని
సూరయామాత్యతిలకుండ సుకవివరుఁడ. 16

క. రామామణులకు మది నభి
రామం బనదగు ధనాభిరామంబు వచ
శ్శ్రీ మెరయఁ బద్యకావ్యము
గా మహి విరచింతు సరసకవు లవునసగన్. 17

క. వెయ్యేల యేను భాగ్యము
సేయుటకుᳵ గానవచ్చె సిద్ధంబుగ నా
సేయంబూనిన కృతికిని
నాయకుఁ డనురక్తి భీమనాయకుఁ డగుటన్. 18

వ. అని విచారించి సరససజ్జనహృదయానందంబగు నీ ప్రబంధం
బున కధీశ్వరుండు సకలసురాసురపూజిత పాదారవిందుండు
నీహారశిఖరకన్యకా వక్షోపరిలిప్తకుంకుమాంకితవక్షస్థలుం

డును కరుణాకటాక్షవీక్షణాలంకారుండును సర్వలోకాధీశ్వరుండును నగు భీమేశ్వరుం భావించి. 19

## షష్ఠ్యంతములు.

క. దివిజగణయక్షదక్షా
స్తవనీయున కఖిలలోకసంరక్షునకున్
భవసంహారునకు లక్ష్మీ
ధవశరునకు సమితశారదానాథునకున్. 20

క. కుంజరదానవదుర్మద
భంజనునకు ప్రమథయూథపరిపాలునకున్
కంజభవామరవరముని
మంజులవాక్యప్రసంగమహిమాఢ్యునకున్. 21

క. క్షితిధరకన్యాధిపునకు
శతమఖముఖదివిజనికరసంయమివరపూ
జిత పదపంకేరుహునకు
సితకరజూటునకు భక్తచింతామణికిన్. 22

క. అంధకగజదైతేయ జ
లంధర ముఖదనుజదళనలాలిత్యకళా
బంధురవిజయోన్నతునకు
సింధురచర్మాంబరునకు శితికంఠునకున్. 23

క. ధరణిజలపవన(హుతవహా)
ఖరచర చంద్రాంబరాత్మ కలితాప్తతను
స్థిరమూర్తికి సకలచరా
చరపరిపూర్ణ ప్రబావస విశేషునకున్

క. దుర్గాధీశ్వరునకు నపవర్గఫలాంచితవిశేషవైభవనిధికిన్
భర్గునకు విమలగుణసన్మార్గైకచరిత్రభక్తమందారునకున్.

క. ఆకాశకేశునకును సుశ్లోకచరిత్రునకు నమితలోకేశునకున్
కాకోదరహారునకును, భీకరునకు దక్షవాటి భీమేశునకున్.

వ. అభివందనంబొనరించి భక్తజనపారిజాతంబగు నద్దేవుని కిట్లు
అనియొ. 27

---

# ప్ర థ మా శ్వా స ము

**క థా భా గ ము**

క. శ్రీనగకన్యాయుత ని
త్యానందసుఖైక వైభవామోదిత సం
ధాన నిజభక్తరక్షణ
భూనుత శ్రీదక్షవాటిపురభీమేశా. 28

క. ఆకర్ణింపుము పుణ్య
శ్లోకముని సురగరుడయక్షశుభవిభవగుణా
నీకము ఘనతరమగు స్వ
ర్లోకము విలసిల్లు మూఁడులోకములందున్. 29

సీ. పసిడిమయంబైన ప్రాకారములచేత
నిండిన పరిఘంబు నిధులచేత
గోమేధికోన్నతగోపురంబులచేత
మాణిక్యఖచిత హర్మ్యములచేత

మరకతస్థాపితవరసౌధములచేత
హరినీలమణుల గేహములచేత
వజ్రదీప్తులమించు వరకుడ్యములచేత
లాలితకృతకశైలములచేత
తే. మెరుగుదీవెలబోలు భామినులచేత
చల్లనై యొప్పు నారామసమితిచేత
చెన్నుమీరిన కొలనులచేత చెప్ప
చూపగలిగినయమరావతీ పురంబు. 30

వ. అందొక్కనాడు. 31

సీ. చాల గొజ్జంగినీట జలక మొప్పుగ నాడి
చీనిచీనాంబరశ్రేణి గట్టి
ఘనసారకుంకుమ కలితకస్తూరికా
మిళిత చందనచర్చ మేననలది
నిర్మలనవరత్ననిచయ కాంతిచ్ఛటా న
వ్యనానాభూషణములు దాల్చి
కమనీయకల్పవృక్షప్రసూనంబులు
కీలుకొప్పున నిండ గీలుకొల్పి
తే. సురగణంబులు సేవింప సొరిది దివిజ
రమణు లందంద వింజామరలు వ్రేయ
ఘనతచింతామణుల పీఠము ననుజూడ
నిండుకొలువుండె మెరసి యాఖండలుండు. 32

వ. ఆసమయంబున తక్కినదిక్పాలకులు చనుదెంచి యథోచితాస
నంబుల నాసీనులై యున్నంత. 33

**సీ.** నీలాలచాయలు గేలిసేయగజాలు
కచములం దరచు చీకట్లుగ్రమ్మ
కలువ రేకులయొప్పు గరింసిచుకన్నుల
కొల్లలై చూపులు క్రీళ్లువార
పరిపూర్ణ చంద్రబింబము మించు మొగమున
దరహాసచంద్రికల్ దరుచుగాయ
వెలుగువిద్యుల్లతావిభవంబు ప్రకటించు
తనువులకాంతిబిత్తరము లెగయ
**తే.** విమలమైయొప్పు కనకకుంభములబోలు
వలుదచన్నులపై హారములు నటింప
పదములను నందియల్ మ్రోయ ప్రబలి దివిజ
లలనలేగిరి దేవేంద్రుకొలువునకును. 34

**సీ.** చారువిద్యుల్లతాసముదయం బెంతయు
మెచ్చులరూపులై మెలగె ననగ
విలసిల్లుపండు వెన్నెలలోని తేట నా
కారంబులై మేన కట్టెననఁగ
నసమానగతి సుధారసము చూడ్కులను
నిరుపమాకృతులచే నెగడె ననఁగ
లాలితంబగు నూత్నలావణ్యరసము లిం
పొంది దేహంబుపై పొసగెననఁగఁ
బల్లవంబులు కోమల ప్రబలవికచ
కుసుమములు నవ్యమృదువును గురుతరముగ
కాయములు దాల్చి నటియించుకరణి నరిగి
రింపుసొంపార సురకాంత లింద్రుకడకు. 35

వ. ఇట్లు చనుదెంచి రంభాద్యప్సరోవిలాసినీసందోహంబులు ప్రియంబున మ్రొక్కిన వేల్పుఱేడు గారవించు మన్ననల చెన్నొంది తలంకక కెలంకులనుండి రయ్యవసరంబున.

సీ. తమ్మిమేడనునుండు తరుణి ముద్దులపట్టి
యల్లఱేరాయని యల్లుగుఱ్ఱ
ఘనతకెక్కినవసంతునితోడి చెలికాఁడు
మనసులమలసెడు మావటీఁడు
పచ్చపిట్టలతేరు పఱపియాడెడుజోదు
పాంథజనంబులపాలిగొంగ
మగతనంబుల కెక్కుడగు తియ్యవిలుకాఁడు
పువ్వులమ్ములు సేయు బూమెకాఁడు
తే. మహిమ దీపింప విటపిటీమానధనము
కలికితనమున గొల్లాడు కన్నకాఁడు
వలపులకు నెల్లగనిలోకవశ్యరూప
మంత్రరక్షాసమర్థుండు మన్మథుండు. 37

చ. చిలుకలతేరునుం జెఱకుశింగిణి వాడని పువ్వుదూపులన్
వెలయగ మీనకేతనము వేడుక గ్రాలగ నద్భుతంబుగా
నళులును గండుఁగోయిలలు నంచలు గొల్వగ నేగుదెంచె ను
జ్జ్వలతరరూపసంపదల వన్నెల దిక్కులు పిక్కటిల్లగన్. 38

క. సరసనవకుసుమమృదుతర
పరిమళములు వొలయభావభవురాకదిదా
సురకాంతానయనోత్సవ
కరమును మోహమును వశ్యకరమును దనరెన్. 39

వ. ఇవ్విధంబున రతిరాజు సురరాజుకడకుం జని తదనుమతంబున
నుచితాసనంబునం గూర్చుండిన రంభాదిప్రమదాజనంబులు
అతులితమోహాయత్తచిత్తలై మత్తిల్లి యితరంబు మఱచి
చూచుచుండు సమయంబున. 40

క. అనిమిషనాథుఁడు నిర్జర
వనితలఁదగఁజూచి మీకవశ్యము చాలఁ
ధనమో రూపమొ చెప్పుడా
యనవుడు మదిఁదెలిసి తెలియ నాకృతు లొలయన్. 41

ఉ. ఊరక యుండె రంభ మరియొక్క తెఱఁ గనుసన్న జేసె నిం
డారగ మంజుఘోష తెగనాడక మీదులు జూచుచుండె తా
నేరనియట్లు నూర్వశి కనిఁ కననట్లుగ మాట లేక పై
చీర చెరంగువట్టి వలచేతబుడింకెను చిత్రరేఖయున్. 42

*సీ. అరసి నిరుత్తరయై యుండె నొక్కతె
వదనాంబుజాతంబు వంచె నొకతె
యూరికె నేల వ్రాయుచునుండె నొక్కతె
చేతఁగేదగి రేకుఁజీరె నొకతె
తడయక బరపె నాతలిడాలి నొక్కతె
వాసపరిపై చూచు చుండె నొకతె
పలుకనేరక సిగ్గుబడియుండె నొక్కతె
మదిలోన దలచుచు మసలె నొకతె
. పొంచి సందిట చెయ్యి సంధించె నొకతె
యొకతె మరుగున సిగ్గుచే నొదిఁగె నొకతె

* ఈపద్యము కొన్ని ప్రతులలో కానరాదు.

భ_క్తి శ్రవణావతంసంబు బట్టె నొకతె
కూడి మెల్లన మంతనం బాడె నొకతె. 43

వ. మరియు తక్కినవిలాసినీజనులు లజ్జానన లై ప్రాజ్ఞాతుని మొగంబు వీక్షించిన. 44

క. సురరాజుతోడ మన్మథు
వెరవున సభవారు వినగ నిట్లని పలికెన్
బరికింప నిందు నందును
తరుణులకును రూపెగాక ధన మేమిటికిన్. 45

ఉ. మానితరూపయౌవనసమగ్రతచే తుదిముట్టి పై కళా
స్థానము లంగభేదములు జాతులుతప్ప కెఱింగి కామవిద్యా
నిపుణుండునై మెలఁగునాతనిగూడి రమించునట్టి యా
మానిని యొండొరుంగవయ మైకొను నే ధనమెంత యిచ్చినన్.

ఉ. చేరికజేసి యంగనలు చిత్తము లప్పు డెరింగి పొందగా
నేరక గాఢపాకముల నెంతయు కాంక్షలు దీర్పజూచినన్
నీరజలోచనల్ ధనము నించక బిల్వరు కాక మేలు కీ
డారసి రూపవంతునిఁ బ్రియంబునగూడ ధనంబు జూతు రే.

క. వలపుగలవిటుని కౌఁగిలి
గలిగిన లోనుబ్బుఁగాక కామిని యొరులన్
దలచునె మానము ప్రాణము
దలచునె ధనధాన్యతతుల తనమదిలోనన్. 48

వ. అని యివ్విధంబున రూపవిలాస విశేషంబులు యోషాచ యంబుల మోహాతి శయంబులకు విహారస్థానంబులని రూపంబు ప్రతిష్ఠించి ధనంబు నిరసంబుగా నాడిన కుబేరుండు

రోషారుణితలోచనుండై పాకశాసనుండు వినం బుష్పశరా
సనున కిట్లనియె. 49

క. నీమాటలసవు రేమియు
నామనసున కియ్యకొనవు నాకును వినఁడా
ప్రేమాతిశయమొ ద్రవ్యమొ
భామినులకు చక్కఁదనము పదటికి జెపుమా. 50

సీ. కడువికృతాంగు చక్కనివానిగాఁ జేయు
పాపకర్ముని పుణ్యపరునిఁ జేయు
చంచలాత్ముని నిశ్చలచిత్తుగాఁ జేయు
నధికభీతుని సాహసాంకుఁ జేయు
కులహీను మిక్కిలి కులజునిగాఁ జేయు
వీరిడివాని వివేకిఁ జేయు
వడి ననాచారునాచారవంతుని జేయు
సరవితో జడమతి సరసు జేయు

తే. జేల నిలభీముడను పేరపిలువ జేయు
రసికతలు యింత లేనినిరక్షరికు
పావనం బైన సకలవిద్యావిశాలుఁ
డనగ జేయును ధనము తథ్యంబు వినుము. 51

చ. సకలకళా ప్రవీణుఁడయి చక్కనిరూప విశేషసంపదం
బ్రకటితుఁడై విశుద్ధగుణభవ్యతనుప్రభ నొప్పుచున్న నా
యకుఁడు దరిద్రుఁడైన మరి యాతని నెవ్వరుఁ జేరనీరు పా
యక ధనహీనుఁడుఁ శవము నారయనొక్కవిధంబుధారుణిన్.

చ. సరసత లేనివాని నతిజాడ్యుని రూపము లేనివాని ము
ష్కరుని వివర్ణునిన్ తనువు చాలగ మాసినవాని ప్రామిడిన్

వెరవిడివాని నైన మరివింతలుసేయగఁ జాల రంగనల్
కరమరుదైనవస్త్రములు కాంచనముల్ తగనిచ్చి పంచినన్.

క. ధనహీనుకులము రూపును
ధనహీనుని నేర్పువిద్య తాలిమి వెరవుక్
వినుతికి నెక్కఁగ నేరవు
వనితలకు ధనంబె మందు వలపుల రేచన్. 54

గీ. రూకగలవారు విద్యలరూఢి మించి
నట్టివారును కులజులు నధమవృత్తి
ధనముగలవారివాకిండ్లదైన్య ముడిగి
కొలిచియుండుట యెరుగవాకుసుమబాణ. 55

వ. అంత "ధనమూలమిదంజగ" త్తనియెడి యక్షేశ్వరునకు నామిథ్యాలాపంబులు వలవదుడుగుమని పుండ్రేక్షుకోదాసనుండు రక్తాక్షుండై వీక్షించి సహాస్యాక్షుండు వినంగ నిట్లనియె. 56

క. జనసమ్మతమగుమాటలు
వినసమ్మతిగాక లేనివిం కలవిం గూ
ర్చిన నేలసభల కెక్కును
తన వెట్టియుతాత పెద్దతనముంగలదే. 57

ఉ. లాలితరూపయౌవన విలాసమగ్రత చాలనొప్పు నీ
లాలకి వేడ్కతోఁడఁదనయాత్మసుఖంబునరూపసంపదక్
జాలవిశేషతంబొదలుచక్కనివానిరమించుగాక తా
మేలిధనంబులిచ్చినను చేకొను నేవిక్రతాంగు నెంతయున్. 58

సీ. పలుమారు కలికి చూపులతోన చిలికించి
పైకొని యంతయు పనులు సేసి

చల్లని మధురభాషణముల నలరించి
చేరవచ్చిన కూడ చెలిమి జేసి
కళలున్న నెలవులు కదిలించి తగుబాహ్య
రతులను చిత్తంబు గరగ జేసి
తమకంబు జేసి నాత్మకు లోనుగా జేసి
హ్యాజ్ఞాతకేళి బుజ్జగించి
తే. సమరతులగూడి పారవశ్యమునుబొందు
కదిసి చమటూరి కౌఁగిట గాఁకదీర్చి
కలయనేర్చిన చాలు నిక్కము ధనంబు
తలప నొల్లరు కలలోన జలజముఖులు. 59

క. గరగరికయుఁ బ్రాయంచును
సరసత్వము నేర్పు రూపు సంపదయును సు
స్థిరమృదుభాషలు గల
పురుషులు గలిగినను ధనము పొలఁతులు తలఁపన్. 60

క. మూటలుగట్టి ధనంబులు
వాటముగా నొసగి తమకు వశమను చునురా
వాటునుగలవాటును నిడ
యేటికి దలచెదరు తమకు యిందునిభాస్యల్. 61

క. రూపంబు ధనము నిచ్చును
రూపం బటు తనకులంబు రూఢిగ జేయుఁ
రూపంబు లోకవశ్యము
రూపము లేనట్టిసరుని రోతురు భామల్. 62

వ. అని కఠోరంబులుగాఁ బలికిన చిలుకతేరివాని నలుక దీపిం
పం గనుంగొని యలకాధీశ్వరుం డిట్లనియె.

క. పొలిచి సతులచిత్తము
నేలాగున తెలియవచ్చు నెరుగనిరీతిఁ
మేలొకదిక్కున నుండగ
తేలింపుదు రొకనివింత తేటలచేతన్. 63

సీ. పోసీక నొకని చూపులచేత కరగించి
మాటల నొక్కని మరగఁజేసి
ఆలింగనంబుల దేలించి యొక్కని
నొకని కౌగిటలోన జోలలార్చి
అధరామృతంబుచే నలయించి నొక్కని
యొక్కని మరుకేళిఁ జొక్కఁజేసి
బాసల నొక్కని భ్రమయించి నేతల
దొడ్డుగా నొక్కని నొడ్డుబెట్టి
గీ. యిన్ని విధముల భ్రమయించి యెవ్వరికిని
వలవ రెంతయు ధనము కేవలము విటుల
భ్రమలఁ బెట్టుచురిది గానక మలముఖుల
మనము లెరుగగవశమె యవ్వనజజునకు. 64

చ. ప్రవిమల బాహుమూలముల భవ్యరుచుల్ ప్రకటించి మేలి
చన్నవ కఠినత్వముఁ మెరుగుపై కొని మోహము పుట్టచూ
పులో, నవకపు చూపులఁ వలపునాటుకొనఁ భ్రమయించి
చేరిపై,భవముదలిర్ప కూటముల ప్రాణము విత్తము గొందు
రంగనల్. 65

క. బిసరుహాలోచను లెందును
పసిడికి తులతూగువలపు బ్రకటింతు రిలఁ

రసికుని గలయగ నొల్లరు
కుసుమాయుధకేళి నెంతకో విధుం డైనన్. 66

వ. మరియు ధనప్రభావంబు వినుము. 67

సీ. ధన మింటిలో త్రవ్వి తండంబు లైయున్న
సకలధాన్యంబులు చాలగలుగు
ధాన్యంబు లింటిలో తరగక యుండెనా
యిచ్ఛాపదార్థంబు లెల్లగలవు
యిచ్ఛాపదార్థంబు లెల్ల భోగించిన
మదగర్వములు మేన ముదిరియుండు
మదగర్వములు మేన ముదిరియుండిన చాల
కామవికారంబులు కాలు ద్రవ్వ

గీ. కదిసియంతంత కామవికారములను
సతుల గవయంగ గోరుదు రతిముదమున
చక్కదనములు చతురత చక్కబెట్టు
కాగ ధనమూల మన్నియు కథల దేల. 68

సీ. రాజిత శ్రీలచే రాజ్యంబు లేలించు
ఘనమైనదుర్గముల్ గలుగ జేయు
నుత్తమాశ్వములను నొగిదోలి యాడించు
మదగజంబుల నెక్కి మలయ జేయు
పసమించు బంగారు పల్లకీలెక్కించు
నాందోళికంబుల నలర జేయు
ధవళంపు ముక్తాతపత్రముల్ బట్టించు
వింజామరంబులు వీవ జేయు

గీ. చటులసామంతమంత్రీశసరసవీర
భటనటానేకమంగళపాఠకాది
మహిమఁ గలుగంగఁ జేయును మానవులకు
ధనము చాలంగఁ గలిగిన ధరణిలోన. 69

వ. మదనునిగాఁ దలంతు రిల మానిను లెల్లరు సత్కవీశ్వరుల్
పదపడి కర్ణుఁ డీతఁడని ప్రస్తుతి సేయుదు రెల్ల దిక్కులన్
మదవదరాతివర్గములు మానుగఁ గవ్వడి యందురు భూప్రజల్
మదినరనాథుఁ డందురు సమస్తము ద్రవ్యముఖంబు చూచినన్.

. చుట్టములు గానివారలు
చుట్టాలము మీకు ననుచు సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు చాలఁగలరే బంధుల్. 70

, కాదనరు ధనము గలిగిన
మేదిని నెటువంటివారి మెలఁకువ మనుజుల్
శ్రీదొలఁగిన నూరంచుల
కైదువ గలజోదునైనఁ గైకొన రెందున్. 71

ι. వేదంబు లాగమవితతపురాణముల్
శాస్త్రంబు లితిహాససముదయములు
భాష్యంబు వేదాంతపద్ధతు లధ్యాత్మ
వాసనల్ యోగంబు లాసనములు
కావ్యజాలము లలంకారనాటకములు
పదములు నసమానపద్యసరణి
నియమంబులు కవిత్వనిర్ణయంబులు మంత్ర
మంజులగానముల్ తంత్రములును

గీ. నింద్రజాలంబు మొదలుగా నెల్లకళల
నభ్యసింతురు మానవు లవనిలోనఁ
గోరికలు మీఱ నెల్ల చేకూరుకొలఁది
నుడువ వెఱపగు విత్తంబుగడనకొఱకు. 72

వ. అని విత్తప్రభావంబు ప్రకటించిన విత్తాధీశ్వరునకుఁ జిత్త
జాతుం డిట్లనియె. 73

క. పనివడి మాటికి మాటికి
ధనముఖ్యము లైనవస్తుతతి దా నిత్యం
బని యందఱు విననాడితి
వినమెన్నఁడు నిట్టి క్రొత్త విశ్వములోనన్. 74

సీ. ప్రాణమిత్రునినైనఁ బగవానిగాఁ జేయు
నఱిమి ప్రాణముమీఁద నలుఁగఁజేయుఁ
గొఱఁ గానియతిలోభగుణము పుట్టగఁజేయుఁ
దోడఁబుట్టినవానిఁ దొలఁగఁజేయు
నరయఁ బాపంబుల కాలయంబుగఁ జేయు
సత్యమార్గంబుల సమయఁ జేయు
వివరింప గురుజనవిద్వేషిగాఁ జేయు
దుష్టవర్తనమునఁ దొడరఁ జేయు

గీ. వసుమతీచక్రమున నెంతవారికైన
దగిలి ధనకాంక్ష యెన్నివిధంబులకును
దెచ్చునదిగాన యిన్నియుఁ దెలియ వినుము
ధనము పాపస్వరూపంబు తథ్య మరయ. 75

చ. జలదము గాడ్పుచందమున చంద్రిక బాలమెఱుంగువీచికల్
తలఁప ననిత్యవస్తువులు ధారుణిలోపల నంతకంటెఁ జం

చలములు సంపదల్ దలఁపఁ జాలధనంబు నిజంబుగా మదిన్
దెలఁగి నుతింప నేల సురసిద్ధసమూహము చూచి నవ్వఁగన్.

వ. అని యర్థంబు నిరర్థకంబుగా నాడినరతీశ్వరునకు గుహ్యకేశ్వరుం డిట్లనియె. 77

చ. చక్కనివారిలో మిగులఁ జక్కనివాఁడ నటంచు నుబ్బుతో
నెక్కుడుగాఁగ నెన్నితి రతీశ్వర! రూపము నెన్నఁ జూచితీ
వక్కట ద్రవ్య మేటికని యొప్ప దటంచుఁ బ్రతాపసంపదన్
నిక్కము నేల ప్రేలెదవు నిర్జరవల్లభుఁ డూరకుండఁగన్. 78

చ. తరమిడి యిన్నిమాటలు వృథా పనిలేవు సమస్తవైభవో
త్కర మగునతువాటిపురిఁ గల్గుధరాస్థలిలోనఁ బోయి నీ
నిరుపమరూపసంపదయు నేర్పునఁ జూపుము నేను వచ్చి యా
పురవరసీమఁ జూచెదను భూరిధనంబున నామహత్త్వమున్. 79

చ. ననవిలుకాఁడ యింద్రుఁడు వినంగను జెప్పెద నెవ్వరోడినన్
గొనకొని దేవలోకమునకు న్వెలియంచు కుబేరుఁడెంతయున్
గనలి ప్రతిజ్ఞ బల్కినను గైకొని రోషసమగ్రచిత్తుఁడై
మనసిజుఁ డట్లకాకయని మారుకుమారు ప్రతిజ్ఞబల్కినన్. 80

ఉ. ధారుణి దిర్దిరం దిరిగెఁ దల్లడ మందెను దిక్కులన్నియున్
వారిధులు న్గలంగె గిరివర్గము లెల్లను గ్రుంగె నష్టది
గ్వారణపఙ్క్తి బెగ్గిలియె వారిజమిత్రుఁడు తప్పఁ గ్రుంకె జం
భారి దలంకె నిర్జరగణావళి వేదనఁ బొంద నయ్యెడన్. 81

వ. ఇవ్విధంబున మారకుబేరులు రూపధనాధిక్యంబులు నిరూపించి యత్యంతక్రోధాయత్తచిత్తులై ప్రతిజ్ఞలు సేసినఁ దనలోఁ జింతింపుచు నెవ్వరి నేమియు నననేరక దేవపతి గొలువు విడచి నిజవాసంబునకుం జనియె సురగరుడగంధర్వ

సిద్ధవిద్యాధరు లాదిగా గలరంభాదికామినీసందోహంబును
దమతమతావులకుం జని రంత. 82

శా. గంధానేకపదానవాధిపమహోగ్రక్రోధసంహారద
ర్పాంధీభూతజలంధరాంతకబలాహంకారచండక్రియా
సంధానప్రబలాంధకారపటలీసప్తాశ్వశశ్వన్నభ
స్సింధుస్ఫారజటాగ్రసీమమహితశ్రీదక్షవాటీశ్వరా. 83

క. ప్రణతాంబుజసంభవసుర
గణవల్లభ యక్షసిద్ధగణమకుటలస
న్మణికాంతిప్రచురనిజచ
రణకోమలపంకజాత రాజార్ధధరా. 84

మాలిని. భవతిమిరపతంగా! భవ్యగంగోత్తమాంగా!
వివిధగుణవిహారా! వేదవేదాంతసారా!
రవిశశిశిఖినేత్రా! గ్రావకన్యాకళత్రా!
దివిజనుతమహేశా! దివ్యమూర్తిప్రకాశా! 85

గద్య. ఇది శ్రీవీరభద్రకృపాలబ్ధ కవితావిశేషమహితచారిత్ర తిప్పయామాత్యపుత్ర సరసజనవిధేయ నూతనకవి సూరయ నామధేయప్రణీతంబైనధనాభిరామం బనుమహాప్రబంధం బున ప్రథమాశ్వాసము.

# ద్వితీయాశ్వాసము

క. శ్రీశైలకన్యకాధిప
యాశీవిషనాథశోభితాంగద నతవా
గీశ ఘనసారహిమసం
కాశా శ్రీదక్షవాటికాభీమేశా 1

వ. దేవా వినవధరింపుము. 2

క. ఆమని చనుదెంచెను వే
రామనియై సకలభూరుహావలిసొబగుల్
రామనిశుకపికభృంగ
స్తోమములగు నంతకంత సొంపు వహింపన్. 3

మ. వినుతానోకహకుంజమంబు లలతన్ విస్ఫూర్తిం బొందంగ న
త్యనురాగంబున భృంగకీరకలకంఠారావముల్ మ్రోయఁ గ్రొ
న్ననవిలాసానికిన్ నుక్కుపట్టగుచు నానాగంధముల్ నిండె మ
న్ననతో వచ్చె వసంతకాలము జనానందంబు గావింపుచున్.

చ. అలినివహంబుకోరికె పికావళికిన్ తగు ప్రాణరక్ష రా
చిలుకలజీవనస్ఫురణ చిత్తజవైభవరాజ్యలక్ష్మి చె
న్నలరు సమీరణంబులకు నర్మిలికూట మనంగ వేడుకన్
మలయుచు నేగుదెంచె మధుమాసము మారమనోవికాసమై

ఉ. చందనమాతులుంగహరిచందనసాలరసాలపాటలీ
కుందకపిత్థచంపకముకుందవటార్జునరావిబిల్వమూ

కందహారీతకీవకుళకాంచనదాడిమనింబభూజముల్
గ్రందుకొనంగఁ జూచి తగఁగాచి ఫలించె వినోదమొప్పఁగన్.

సీ. మదనునియాస్థానమంటపంబు లనంగఁ
జూతపోతంబులు సొంపు మీఱె
నంగజరాజ్యసింహాసనస్థలు లనఁ
బున్నాగములు చాలఁ బొలుపు మీఱె
ననవిల్తుశృంగారనాట్యశాల లనంగ
వకుళంబు లెంతయు వన్నెచూపె
నతనుని క్రీడాగృహంబులో యన నొప్పి
మాధవీనివహంబు మహిమఁ దనరె

గీ. శంబరారాతిపటుశస్త్రశాల లనఁగ
లీలఁ జూపట్టె జాతిమల్లియనికుంజ
పుంజముల మించుమంజుళపుష్పలతల
శ్రీకరంబును సకలసౌభాగ్యకరము
నగుచు విలసిల్లె ధరణిఁ జైత్రాగమంబు. 7

సీ. మంజులనవలతాకుంజపుంజమ్ములు
రంజిల్లు ధారాధరంబుగాఁగఁ
జంచరీకాటోపఝుంకారములు మహో
ద్దండభీషణగర్జితములుగాఁగ
గాలితాకున నేల రాలుపూమొగ్గలు
కడిమిచే వడగండ్లకరణిగాఁగఁ
దోర మెయ్యెడలేక పొరఁగుపూదేనియ
విడువక జడిగొన్న వృష్టిగాఁగఁ

గీ. దాకి వ్రాల్త్రోడి మెలఁ గూడి తరులనుండి
జారుపూసోన సోనపుంజములుగాఁగ
నంచితస్ఫూర్తి నీవసంతాగమంబు
ధరణి వర్షాగమంబు చందము వహించె. 8

సీ. వివిధగంధానూనవమంజులోత్పల
కుసుమసౌరభములు గ్రోలి గ్రోలి
కలితసౌరభగంధకాసారసుస్థిర
వీచికావలిఁ గొంత దేలి దేలి
కమనీయపరిమేళఘనతసారంబుల
సోన లందందెల్ల సోలి సోలి
విలసితోజ్వలితకోమలచారుసహకార
పల్లవంబులమీఁద వ్రాలి వ్రాలి

గీ. విటవిటీసంఘముల మీల వేఁటకాఁడు
రతిమనోనాథుసంగడీఁ డితఁ డనంగ
కలను శృంగారరసవాటికల నమర్చె
నద్భుతానందరీతిఁ జైత్రాగమంబు. 9

వ. మఱియు మిసమిసై నపస దొలంకు కిసలయంబుల కసికాట్లు గాఁ గఱచి తొగరునుం బొగ లెక్కి మిగులజిగినిగుడఁ జిగురాకు జొంపంబుల కంపంబులు లేక సొంపుననసమశరవిజయప్రయాణకాహళులభంగిఁ జెలంగి సంగతిమీఱఁ బంచమస్వరాభిప్రాయంబున వాయెత్తి కూయుకోయిలంబును మధుదసంచలితంబు లగుపరిపక్వఫలంబులు కొంచక చంచుపుటంబులఁ జించి దట్టంబులయిమిట్టించి తొరఁగుఫలరసబిందుసందోహంబు నాకంఠపూరితంబులుగాఁ గ్రోలి సోగి తుమ్మెదలు

కొమ్మలతుద కెక్కి నిక్కి చక్కెరవిలుకాని రాణివాసంబుల వీణానినాదంబులభాతి రీతిగా నెలుఁగెత్తి పలుకుచిలుకలును నికుంజపుంజంబుల రంజితమంజుళకుసుమమంజరులు గ్రందుకొని చిందుమకరందంబులు కుత్తుకనిండుగా భుక్తిగొని మత్తిల్లి చిత్తజాతుని విజయశంఖంబులవడువున మెండుకొని మ్రోయుగండుతుమ్మెదలపిండును సూనశరసేనకు గ్రోలుగా వివిధనవకుసుమపరిసరంబుల విడియింపుచు నింపుదొలంకక నవలతానురక్తకీజనశీతూవిచక్షణావిభ్రమారంభంబుల విజృంభించి పురవరోద్యానవాటికాశిఖరాంతంబుల వెలయుకమ్మదెమ్మెరలును వికసితకమలకువలయకుముదసౌగంధికగంధబంధురకబంధపూరితంబు లగుకాసారంబుల వేసారక బిసరసంబులం బ్రియుల కందిచ్చుచుఁ గూలంబులను కూలంబులయి సురాళంబులం మెలంగుమరాళంబులం గలిగి విశ్వజనానందకరంబును వనలక్ష్మీమానసోల్లాసంబు నగు మధుమాసంబు పుత్తెంచిన. 10

క. సూనాస్త్రుఁడు ధనపతితోఁ
దా నాడినయట్టి ప్రతిన ధర చెల్లింపం
బూని చనుదెంచి వేగన
భూనుత మగుదక్షవాటిపురవరమునకున్. 11

వ. ఆపురం బెట్టిదనిన. 12

చ. సరసిజబాంధవుం డరుగుచక్కటిః దార్కొని చిత్రరూపబం
ధురవరకేతనోత్పలవినూతనతోరణచారువైభవ
స్ఫురణఁ దనర్చి వైరినృపపుంగవసేవకఖేదకృత్తమై తగ
స్ఫుటతరలీల నప్పురము కోటలు చూపఁగ నొప్పు ధారుణిన్.

క. చెలువలరుపరువులోతును
గలిగి విశుద్ధాంబువులను గమనీయంబై
జలరాశి చౌకఁ జేయుచుఁ
బలుతెఱఁగుల పరిఘ లమరుఁ బట్టణసీమన్. 14

సీ. పరిఘాదిలోతును బరపును నెల్లెడ
నేడువారాసుల నేలుకొనును
వస్త్రసమున్నతి వదల కద్భుతముగా
నాకాశమండలం బదుముకొనును
కడ లేనిమేడలపాడవు భానునితోడ
మించి యొక్కట నావరించుకొనును
గృహములవిభవంబు గీర్వాణసౌఖ్యంబు
వేడుకతో కడు వాడుకొనును

గీ. నవనిధానంబులను మహోత్సవమునయము
నింపు సొంపొందఁ దనలోన నిముడుకొనును
ననుచు సందఱుఁ గొనియాడ నవనిలోన
సాటి కెక్కను శ్రీదక్షవాటిపురము. 15

ఉ. కోరిక మీఱ నప్పురముగోపురముల్ గగనంబు ముట్టి యిం
పార నతిక్రమించినభయంబునఁ ద్రోవయు గానరాక పెం
పారసి పద్మబాంధవుఁ డహర్నిశముం దనరూపు రూఢిగా
నోరణగండ్లలోఁ బరపుచుం దగఁ జూపును కాలమానముల్.

ఉ. మెచ్చులు మీఱ నప్పురము మేలగుహర్మ్యతలాగ్రసీమలం
జెచ్చెర నాడుబాలికలచిత్తము లుబ్బఁగ వచ్చి వేడ్కతో
నచ్చరలేమలుం గలిసి యద్భుతవాక్యవిశిష్టవైఖరిన్
ముచ్చటలాడుచుండెదరు మోదముతోడుతఁ గూడినిచ్చలున్.

ఉ. మేలిమి నాకగేహముల మించినయుజ్జ్వలశాతకుంభర
మ్యాలయదివ్యగేహసముదంచితకుడ్యవిచిత్రరత్నసం
జాలసుదీప్తి వర్వఁగ నిశాభయ మెన్నఁడు లేక వైభవ
శ్రీలలితోన్నతస్ఫురణఁ జెంది చరింతురు మర్త్యు లప్పురిన్.

మ. మదధారల్ గురియంగ భూతలము సమ్మర్దంబుగాఁ బంకమై
చెదరన్ గర్వము మించియష్టమదముల్ చెన్నగ్గలింపంజయా
స్పదమై జంగమశైలసంఘముల నుత్సాహంబు సంధిల్ల స
మ్మదలీలాగతి నుండు నప్పురములో మాతంగముల్ వేడుకన్.

చ. కసమునఁ జూపరాక యెదఁ గైకొని ధీయనఁ గాలుమించి యా
కసమునకైనఁ బ్రాఁకి జవగాఢసమున్నతసత్త్వమూర్తులై
యసదృశలీలఁ జిత్తరువునందు లిఖింపఁగ రానిరూపముల్
పసఁ దళుకొత్తనశ్వములు బాగగు నప్పురిఁ జెన్ను లెన్నఁగన్.

క. బంధురవిభ్రమమదప్రు
ష్పంధయబకచక్రహంసపటుకలనవసౌ
గంధికవికచనవాంబుజ
గంధంబుల నొప్పుఁ బురముకమలాకరముల్. 21

శా. సారంబై నవపల్లవప్రసవగుచ్ఛస్వచ్ఛవల్లీమత
ల్లీరమ్యోరుశిలాటుసత్ఫలరసల్లీలాసముల్లాసశృం
గారాపూరవసంతవైభవరమాకల్యాణదామంబులై
యారామంబులు మించు నప్పురము లో నాకల్పసీమంబులై.

సీ. మలసి నిర్మలనూత్నమకరందముల సోలి
చల్లనికుసుమవాసనలు గ్రోలి
విమలకాసారాంబువీచికావళిఁ దేలి
సహకారతరువులజాడ వ్రాలి

పృథులవిశేషపుష్పితలతావలిమాలి
కాసమూహంబులఁ గవిసి వ్రేలి
బంధురగతి నన్యగంధంబులను గ్రోలి
క్రొన్నిసుగంధంబు గోరి యేలి

గీ. జగములకు నెల్ల నానంద మగుచు మేలి
మతులసౌరభ్యశైత్యమాంద్యముల సోలి
విలసితశ్రీలఁ గనుపట్టువేలవ్రాలి
సరిసరిత్తుల విహరించుఁ జల్లఁగాలి. 23

సీ. మదనవశీకారమంత్రరూపములన
మెలఁగెడుతొలుకారుమెఱుపు లనఁగ
నడపాడ నేర్చిన నవకంబులతలనఁ
బొలుపొందువెన్నెలబొమ్మ లనఁగఁ
బసమించులావణ్యరసమూలము లనంగ
లాలితకనకశలాక లనఁగఁ
జేతంబుఁ దళుకొత్తుచిత్రరూపము లన
రమణీయతరరత్నరాసు లనఁగ

గీ. మూర్తు లలరించునవకంపు మొలక లనఁగఁ
బలుక నిలిచినఁ గపురంపుఁబలుకు లనఁగఁ
గలికిమరుచేతి ముద్దురాచిలుక లనఁగఁ
జాల వెలసిరి యప్పురిచంద్రముఖులు. 24

క. నిగనిగ మనియెడిమేనులు
దిగదిగ నడచినను నొగిలి తెగియెడునడుముల్
జిగిబిగి గలకుచములు నగు
మొగములుఁ దముఁ బొగడఁ బురమువనితలకెల్లన్ 25

సీ. వేదశాస్త్రాగమవిపులనానాధ్వర
ప్రావీణ్యయుతు లైనబ్రాహ్మణులును
బాహుబలాటోపపటువిక్రమోద్దండ
జయరమాధిపు లైనక్షత్రియులును
వివిధవస్తువ్రాతవిక్రయక్రయమహా
వైభవోన్నతు లైనవైశ్యజనులు
నిత్యధర్మక్రియాసత్యవిశేషవ
చోవిశారదు లైనశూద్రవరులు

గీ. నటవిటానేకసామంతభటసుమంత్ర
పుష్పలావికగాయకపుణ్యసతులు
గలిగి యమరావతీపురి కలరు సాటి
ధరణి సౌఖ్యంబులకుఁ జూటి దక్షవాటి. 26

వ. ఇట్లు సకలసౌఖ్యములకు జన్మస్థానంబన సర్వంసహాకాంతకు దర్పణంబనఁ దనరి లోకాభిరామం బగుదాక్షారామంబుఁ గనుంగొని . యత్యంతసంతోషాయత్తచిత్తుం డై చిత్తజాతుండు దరియం జనునప్పుడు. 27

సీ. కమనీయతరకచ్ఛపములు మీఁగాళ్లుగా
సైకతస్థలికటిస్థలముగాఁగ
భాసురావర్తవిభ్రమరీతి నాభిగా
వరకోకములు కుచద్వయముగాఁగ
విదితశంఖములయొప్పిదము కంఠమ్ముగా
మోవి పద్మముసొంపు మొగముగాఁగ
దళుకువేడిసమీలు ధవళనేత్రములుగా
నవకంపుఫేనంబు నవ్వుగాఁగ

గీ. ఘనత తనయందె పుణ్యముల్ గలుగు ననుచు
వీచికాహస్తములు సాచి వేడ్కఁ బిలుచు
ముక్తికామినివిధమున మురియుచున్న
సప్తగోదావరముఁ జూచె శంబరారి! 28

ఉ. శ్రీవిలసిల్ల సంస్మరణఁ జేసిన యాగఫలంబు గల్గు సం
భావన మీఱఁ జూచినను బాపము లెల్ల నడంగు నేదెసన్
బోవక తీర్థమాడినను బొందు శుభంబులు చారుసప్తగో
దావరిసింధుకున్ సవతు ధారుణి లేవు తలంప వాహినుల్.

వ. అని కొనియాడుచు నాపుణ్యసింధుబంధురంబుగ నవగా
హన మ్మొనర్చి. 30

క. ధనమూలము లగుసొమ్ములు
తనువునఁ దగఁ బెట్టుకొనిన ధనదునితో నా
డినప్రతిన తప్పునో యని
యని దాని దిరస్కరించె నతనుఁడు వేడ్కన్. 31

సీ. లాలితబిసతంతుజాలసంధానవి
చిత్రాంశుకంబులఁ జెలఁగఁ గట్టి
పసిఁడివన్నెలతోటి పదనిచ్చి గలపిన
పూదేనెగంధంబు పూసఁగ నలఁది
తనమోహనాస్త్రసంతతి యైనచల్లని
పరిమళమిళితపుష్పములు ముడిచి
కామినీజనవశీకరమంత్రయుత మైన
పూదేనెతిలకంబుఁ బొందుపఱచి

లలితనిజరూపరేఖావిలాసచతుర
విభ్రమారంభసంరంభవిపులవిభవ
విక్రమాటోపనిఖిలదిగ్విజయబాహు
దర్ప మేర్పడ నిలిచెఁ గందర్పుఁ డపుడు. 32

క. అతనుండయ్యును జగములు
కుతలము గుడువంగఁ జేయుకుసుమాస్త్రుడు స
మ్మతి తనువు దాల్చి వచ్చెను
గుతలము దానింక నతలకుతలము గాదే. 33

క. వరసౌందర్యము గలిగిన
పురుషులకును బెట్టనేల భూషణములు భా
సురతరరూపముకంటెను
కర మరుదుగ భూషణంబు గలదే జగతిన్. 34

క. లావణ్యములకు మూలము
భావజుఁ డామీఁద వన్నె పచరించినఁ జూ
చేవిధిని నిలుతురో యిక
భూవలయములోనఁ గలుగుపొలఁతులు దలఁపన్. 35

వ. ఇట్లు సూనశరుండు మానవరూపంబుఁ దాల్చి నిల్చితనకుఁ జెలికాఁడగుపటువిటపికులచాటివాటికాంతుం డగువసంతుండు భృత్యసమ్మదబంధురభావంబున తీవిమీఱ నోలగంబు నడుపురూపుగాఁ గరంబు మూపునం గీలించి దంటతనంబున వెంట నేతేర నిక్షుశరాసనుండు దక్షవాటికాకటకఘంటావీథిం జనుదెంచునప్పు డతనిం గనుంగొని పౌరులు దమలోన.

సీ. పొందుగాఁ దనమేనికందు పోపఁగఁ జేసి
యిటకు నేతెంచెనో హిమకరుండు

హయముఖాకృతి మాని యలరుసుందరరూప
కోవిదుం డగునలకూబరుండొ
తనరూపురేఖలు దాల్చి యిచ్చోటికి
నిజరూపమున వచ్చునిషధవిభుడొ
కలితలావణ్యరేఖావిలాసస్ఫూర్తిఁ
బ్రబలిననిర్జరపతిసుతుండొ
గీ. యుగ్రపటుతీవ్రనిటలాంబకోగ్రదహన
శిఖలు నెరియనిమాతనచిత్తభవుఁడొ
కాక వివరించి చూచిన లోకమునను
నిట్టిరూపంబు మనుజుల కేల గలుగు. 37

ఉ. పువ్విలుకానిఁ బోలినయపూర్వమనోహరమూర్తివాఁడహో
యెవ్వఁడొకోయితండు మన మెవ్వరుచూడనివాఁడు కాఁడుశ్రీ
నివ్వటిలంగ మన్మథుఁడు నేఁడుపుమీఁఱను మర్త్యరూపమై
యివ్వసుధాస్థలిన్ జనులనెల్ల భ్రమింపఁగ వచ్చెనోజుమీ.

వ. అని యందఱు నద్భుతానందచిత్తులై విలోకింపఁజిత్తజాతుండు
చనుదెంచి. 39

సీ. గురుతరం బగుచిత్రగోపురప్రాకార
మహితకాంచనమణిమంటపములు
ప్రత్యగ్రరచనానుబంధబంధురశాత
కుంభరత్నోజ్జ్వలకుంభములను
భూరినిఖలవాతపూరణతోరణ
చాతుర్యనృపభేంద్రకేతనములు
పటహభేరీశంఖపటుఘంటికానేక
భీషణాటోపనిర్ఘోషణములు

గీ. కలితకర్పూరగుగ్గులగంధసార
భూసురామోదకరధూపవాసనలును
మహిమదనరిన భీమేశుమందిరంబు
గాంచి ముందర నేతెంచెఁ బంచశరుఁడు. 40

వ. మఱియు నక్కడ. 41

ఉ. తాళములు న్మృదంగములు దండెలు జంత్రముఁ లావజంబులు
న్కాళెలు వాశికంబు లొక కట్టునఁగూర్చి శ్రుతుల్ నిబద్ధిగా
నాళతిఁజేసి లేమలు సమంచితవైఖరిఁగూర్చి పాడఁగా
లాలితనర్తనక్రమవిలాసవిశేషము లుల్లసిల్లఁగన్. 42

చ. కడువడిఁ దాళరూపజము కాహళమర్దళలాశక్రోలుచె
న్నడరుచు వీణ దండ మొనలన్నియు నొక్కటిగా నొనర్చి పై
బడగ శ్రుతు ల్సమంబుగ నిబద్ధిగఁగూడి సుతానమానము
ల్తడబడకుండ జూచి భరతస్థితి దప్పక మేళనంబునన్. 43

క. పటు వగుధ్రువయును జంపెయు
మఠెమును చెన్నగుసుభద్రమానితచంచ
త్పుటమును మొదలుగ మరి వి
స్ఫుటమతి నూటొక్కతాళముఁలు విలసిల్లన్. 44

క. శ్రీపురుషరాగభేదము
నేపార నెఱింగి వేళ నెన్నికమీఱన్
రూపించి పాడి రపుడు వి
రూపాక్షుని మ్రోల చిత్రరూపులు గలుగన్. 45

చ. ఇరువదియారుపీఠణము లెన్నఁగ నాలుగువర్ణచేష్టలన్
బిరుదుగ నేడుభూనటన లర్వదినాలుగుదోర్విలాసముల్

సరసతఁ జూపి హంసవృషసామజవాయసశుద్ధసంగతుల్
పరువడి ముట్ట నిల్చి సితపంకజలోచన లాడుచుండగన్. 46

సీ. మురువు లివియు నేర్పు మోహంబు గల్గును
మీఱఁ బుష్పాంజలి మేర జేసి
కరముఖబాహూరుకటకావి శేషము
కురవిభవంబులు గరిమఁ జూపి
తోడుత ఘట్టితోద్ఘాతాది పదవిశే
షంబులబాగుల సరవి నెఱపి
కలితబాహ్యాంగచక్రకములక్షణములు
భ్రమరులు పచరించి బంధురముగ
తానమానంబులును బంధుస్థానములును
దివ్యగీతప్రబంధసంధానతాళ
చతురగతు లగుభావరసంబు లలర
నాట్య మొనరించి రింతులు నయ మెలర్ప. 47

క. అంగంబుల మెరవడి ప్ర
త్యంగంబుల చెప్పెదను నుపాంగంబులు నా
సంగతి త్రివిధభరతమ
తంగాదిమునీశ్వరులమతము విలసిల్లన్. 48

క. శిరమును వక్షస్థలమును
గరతలమును మఱియుఁ బార్శ్వకటినాదంబుల్
సరసాంగంబులు దప్పక
యిరువురు వేర్వేర నిర్ణయించిరి మొదలన్. 49

గీ. చారుగళబాహుతుండోరుజానుజంఘ
లెన్నఁ బ్రత్యంగములు వాని నెల్ల నెఱిఁగి

బహువిధంబుల నెఱపిరి భరతశాస్త్ర
లక్షణంబులు దళుకొత్త లాస్యకంబు. 50

క. విలసద్భూషణసుందర
ములు సానువవరకపోలములు దక్షయముగ్
వెలయు నుపాంగంబులు ని
శ్చలతను వెన్నెత్తి తతులవిభ్రమ మెసఁగన్. 51

వ. ఇవ్విధంబునఁ బ్రమదావిజనులు నృత్యంబులు సలుపుచుండఁ
భీమేశ్వరునియవసరంబువేళ చనుదెంచిన. 52

సీ. పంకజోదరపద్మభవసహస్రాక్షులు
సేవింతు రేదేవుఁ జిత్త మలర
వ్యాసగౌతమభరద్వాజాదిమును లెల్లఁ
బూజింతు రేదేవుఁ బొలుపు మీఱ
నాగి హరిశ్చంద్రాదు లగుచక్రవర్తులు
కొలుతు రేదేవునిఁ గోర్కు లలర
భరతరామాదిభూపతులు పదార్థురు
నర్చింతు రేదేవు నారతంబు
నట్టి దేవుని శివుని నీహారశిఖరి
కన్యకావనసంఫుల్లకమలహంస
దక్షవాటీశ్వరుని హిమధామఖండ
ధరుని భీమేశ్వరుని బురహరుని హరుని. 53

వ. భక్తితోడను దర్శించి పంచామృతంబున నభిషేకంబుఁజేసి.54

చ. జలరుహాసంభవామరులు సన్నుతి సేయఁగనేర రెందు ని
చ్చలు మఱి వేదశాస్త్రములు సంస్తుతి సేయఁగలేవు కోరి ని

శ్చలమతులై నయాదిమునిసంఘము సంస్తుతి సేయలేరు నా
యలవియె మిమ్ముఁ జేరికొనియాడ మహేశ్వర పార్వతీశ్వరా.

వ. అని స్తుతియించి యద్దేవుని సమ్ముఖంబు వెడలి యాస్థాన
మంటపప్రదేశంబున నిలిచి. 56

గీ. వరుస నావేల్పు సేవింప వచ్చియున్న
చారుతరమూర్తు లప్సరోజలజముఖులు
సానెరమణుల వీక్షించి సంతసమున
సరసవిటచిత్తసంచారి శంబరారి. 57

ఉ. మానవులెల్ల మెచ్చఁగను మక్కువమీఱఁగ భీమనాథుతోఁ
మానుగఁ బెండ్లియాడి బహుమానమునన్ విహరింపుచున్
కళా,స్థానము లే విశేషగుణదానగుణంబులు మించినట్టి యా
సానిచకోరలోచనల శంబరవైరట చూచి వెండియున్. 58

చ. కలకల నవ్వుమోములును కల్కివిలాసము మొల్క
చన్నులున్, చిలుకలపల్కులన్ గెలిచి చెన్ను వహించిన
ముద్దుమాటలున్,దళతళ మించుటద్దముల చక్కని చొక్కపు
కంఠభాగముల్, గలిగి సమస్తసౌఖ్యములకందువలోఁ యన
నొప్పు కామినుల్. 59

క. నాయకరమణీమణులకు
నాయకమో యనఁగ దనరి నలి సౌందర్య
శ్రీయన నభిరామంబై
తోయజనళనేత్రి మహిమతోఁ విలసిల్లన్. 60

చ. మొలక మెఱుంగు జాజి విరిముత్యపుజల్లి పళించిబొమ్మరా
చిలుకలకొల్కి మోహనవశీకరమంత్రము మించు చొక్కపుం

గలిగి చకోరనేత్రి పసగల్గినరత్నశలాకకాంతి చే
నలరినచంద్రరేఖ యనునంగనఁ జూడఁగ నొప్పు ముందటన్.

ఉ. పెంపుడుగాక హీనులకుఁ బిల్చు మనస్సదిగాక మిక్కిలిన్
దెంపరిగాక వట్టితరితీపుదిగాక విరాలిగాక యే
రంపలగొడ్డుగాక బలురాయిడికత్తెయుఁగాక యెప్పుడున్
సొంపుగ నింతలేనియెడ జూదరికత్తెయుగాక యింతయున్.

ఉ. వెన్నెల నాడఁబాడఁ జదువంగలకావ్యముఁ జెప్పవ్రాయఁగాఁ
గిన్నెరమీట వీణెయును గీర్తితబుద్ధిని బట్టురూపము
న్నున్నతి కెక్క వైభవవిశాలగుణోజ్వలచాతురీ ర్తితో
నన్నిట నేర్పరైన సుగుణావతిఁ జూచె మరుండు వేడుకన్.

సీ. పెంపారుతననారివైరికుంతలములు
చెలఁకుసింగిణివింటిపేరిబొమలు
మీనకెక్కము పేరిమెఱుగారు నేత్రము
లలరుతూపులతోడి యక్షియుగము
విజయశంఖము పేరి వినుతకంఠంబులు
తేరి వాహనముల పేరిపల్కు
లారుతూణంబుల పేరింటిజంఘలు
మూలబలము పేరి మురియు నడుము

గీ. ...      ...      ...      ...
...      ...      ...      ...
లమర తనచిన్నెలన్నియు నద్భుతముగ
మించి వేడ్కలు దయివారఁ బంచశరుడు. 64

క. తనతూపులనే వలసెను
వనజాయతనేత్రి చిత్ర వరమీనము పెం

పునఁ దగిలి వెతను బెట్టెను
మనసిజుఁ డనువేటకాఁడు మహిమ దలిర్పన్. 65

వ. అప్పుడు. 66

ఉ. ఆతరుణీలలామ ప్రియమంది ముదంబునఁ జూచె సద్గుణో
పేతుని సూనశస్త్రముఖభేదనమాసమానినీవిట
వ్రాతుని సర్వలోకహితవశ్యకరోజ్జ్వలచారురూపవి
ఖ్యాతవినిర్మలస్ఫురితకాటనకేతునిఁ జిత్తజాతునిన్. 67

క. వరసౌందర్యముఁ గల్గిన
పురుషులకును వలచు టరుదె పొలఁతుక ధరలో
మరు డిఁక గెల్చునొ యనుచును
సరి ఖేచరు లెల్ల నొక్కసంగతిఁ బల్కన్. 68

వ. అప్పుడు మన్మథుండు సుగుణావతి తనకు వశంబగుట
యెఱింగి యచ్చోటుఁ బాసి కదలి భీమేశ్వరుని ముఖమంట
పంబునఁ గూర్చుండె నంత విలాసినీజనంబులు ముదంబున
నద్దేవుని యవసరంబు దీరి తమతమమందిరంబుల కేగ మనుజ
భావంబున నున్నభావసంభవు నీక్షించి. 69

చ. నలుడొ శశాంకుడో దివిజనాథునికూరిమినందనుండొ కా
కలనలకూబరుండొ ప్రియమారఁగమానవరూపుఁదాల్చి తా
నిలను దరించ వచ్చినరతీశుఁడొ యన్నియుఁ జెప్ప నేల మీా
చెలువము మర్త్యులందు విలసిల్లఁగ నేర్చునె బ్రహ్మగూర్చునే.

సీ. కాంక్షించి కన్నులకరు వెల్లఁ దీర డ
గ్గరి వీనిఁ జూడనికన్ను లేల
బిగియారఁ గౌఁగిటఁ బెనగి వీనురమున
చక్కగాఁ గదియనిచన్ను లేల

కళలు దైవాఱ వేడ్కలు మీఱఁగా
వాని వరుస రమింపనివయ సదేల
సరససల్లాపభాషణముల వీనితో
సరిప్రొద్దు పుచ్చునిజన్మ మేల
వీఁడు వెలిగైనరూపంబు విభవములును
వన్నెలును నేల సతులకు వసుధలోన
ననుచుఁ దలపోసి రప్పు డత్యంతవిరహ
వేదనలఁ బొంది రప్పురి వెలవెలఁదులు. 71

వ. ఇవ్విధంబున వారవధూతిలకంబు లందఱు దలఁచుచుఁ దమ తమనివాసంబులకుఁ జని రట సుగుణావతి మందిరంబున కేగి యత్యంతవిరహవేదనాయత్తచిత్తయై యేకాంతంబునం గూడక నిజనివాసంబున నుండె నప్పుడు. 72

ఉ. రూపము గానరాక మఱిరూఢికి నెక్కి జగత్త్రయంబు సంతాపము బొందఁజేసిన ప్రతాపము గల్గినతియ్యవింటిజో దేపున రూపు దాల్చి ధర కేగి చరించినఁ జూచి యింతు లే రూపున నిల్తురో గలికి రూఢిప నీమరు సేఁత లన్నియున్. 73

గీ. చంద్రజూటుని దేహంబు సగము చేసె
విష్ణునురమున గంతులు వేయఁ జేసె
నురికి బ్రహ్మను నోరెత్తకుండఁ జేసె
నింతులన నెంతవారలు కాంతునకును. 74

క. మునుకొని జగములు పొగడఁగ
ననువుగ నెటువంటివారినైనను గాల్పఁగ
ఘనత గలమాయదారట
తనపనిఁ దాఁ జేసికొనఁడె ధర్మకుఁ డంతన్. 75

క. ఆరామామణి యంగజు
నారసి కన్నారఁ జూచినప్పటివలె నిం
డారఁగ విరహాసమున్నత
భారము మేనికిని మిగిలి పరవశ యగుచున్. 73

క. గాలము మ్రింగిన మత్స్యము
పోలిక రమణీలలామ పొగులుచు మిగులం
దూలి పువ్వుశయ్యఁ బొరలుచు
జాలింబడె మరుని యింద్రజాలముచేతన్. 74

సీ. కనుకళితోఁ బెట్టెఁ గాంతాశిరోమణి
తలపోయుచుండెను దరళనయన
కాంక్షల కడు దస్సెఁ గామినీతిలకంబు
వర్ణింపఁగా వచ్చె వనజనయన
తమకించె గవయ నెంతయును గోకిలవాణి
సిగ్గు చక్కంబెట్టెఁ జిగురుబోఁణి
ప్రియము రెట్టించంగ నియమించె మానిని
వలపున శోషించె వరవధూటి
యతనిధ్యానంబుఁ జేసె రాయంచమిన్న
ముదముతోఁ దన్ను మఱచెనో మోహనాంగి
తనరి యది దశావస్థల ననుసరించి
యంగజునిఁ జూచి గుందె నాయతివ యపుడు. 75

ఉ. వాడెను మోముదమ్మి తనవారల నెవ్వరిఁ దేరిచూడఁగా
నూడెను గన్నుదోయికిని నూర్పులు దట్టములయ్యె మేనికిఁ
గూడెను తాప మగ్గలము గోరియు హారము నేను ధైర్యమూ
టాడెను మేను దస్సి విరహాగ్నిని గంజదళాయతాక్షికిన్. 76

ఉ. పొరిపొరి వెచ్చనూర్చుఁ దలపోయుమనంబునఁ దాల్మి లేకలో
విరవిరబోవు మిన్నరయుఁ జేరున బిల్చినయట్టివారల
న్వేరవిడి వీడనాడుఁ గడువేదన బొందును వారిజాస్యయున్
గరములు బుణుక్కొంచు మఱి కామినియుండెననేకరీతులన్.

సీ. సఖియకుఁ జెలితోటి సఖ్యం బసఖ్యంబు
ముదితకు రాయంచ మురువు బరువు
పొలతికి నడ చూడ పోతంబు భూతంబు
చెలువకుఁ జెంగావివలువ బలువు
నాతికి వీణానినాదంబు ఖేదంబు
పడతికి విరిజాజిపరుపు నెరుపు
సతికిఁ జల్లనిగంధసారం బసారంబు
భామకు రాచిల్కపలుకు నులుకు
కువలయాక్షికి కోయిలకూత ఘాత
మోహనాంగికి తుమ్మెదమ్రోఁత రోఁత
వెలది కీరీతి నంతయు వింతలయ్యె
నంగసంభవుఁ గనుగొన్నయంతనుండి. 78

వ. ఈవిధంబున విరహావేదనం జిక్కి వివశత్వంబునం బొందిన
సుగుణావతిం జూచి యొక్కచెలియ యిట్లనియె. 79

ఉ. సన్నుతిసేయఁగా దగినసానికులంబునఁ బుట్టి ప్రాయమున్
వన్నెయు వాసియున్ సుగుణవర్తన రూపముగల్గి సంపదన్
యొన్నికమీఱఁ గన్నులకు నింపగువారల బొందఁగల్గి యో
కిన్నరకంఠి నీదుమది కింపగుకారణ మేమి చెప్పవే. 80

గీ. నీవివేకమహిమ నీరాజసంబును
నెందు కేగె నేచు యిందువదన

చేరి మాకు బుద్ధిఁ జెప్పితి విన్నాళ్లు
నిన్ను దెలుపవశమె నీరజాక్షి. 81

క. నీమనసు గలదు యేమిట
భామామణి యడుగ నీకు భయ మది యేలా
ప్రేమమునఁ దెచ్చిపెట్టెద
భూమండలిసఖుల నన్ను బోలంగల రే. 82

వ. అని బుజ్జగించి తనపయంటచెఱంగునఁ గన్నీరుదుడిచి కురుల నులుదీర్చి భూషణంబులు చక్కసంధించి మధురాలాపంబు ప్రియంబునం గూర్చి యడిగిన నచ్చెలితో సుగుణావతి యిట్లనియె. 83

ఉ. కోరికె భీమనాయకునిఁ గొల్చి వినోదముతోడ నుండగా
మారునిఁబోలునట్టిసుకుమారుఁడుమంచివయస్సువాఁడు నిం
పారఁగ నేగుదెంచిన ప్రియంబునఁజూచినయంత నుండియున్
వారిజనేత్రి వానికి నవశ్యము చిక్కితిఁ దెక్కలేటికిన్. 84

ఉ. వేడుకతోడ వాని కనువిచ్చి నయం బనయంబు మీఱఁగాఁ
జూడకయున్నఁ జిత్తమున రూఢి రతీతమకంబు పుట్టగా
కూడక కూడి కోర్కెలును కూరిమిమీఱఁగఁ గామవార్ధి నో
లాడక యుండి లోనివిరహాగ్ని నడంపఁగవచ్చునే చెలీ. 85

క. ననుఁ జూచి వలతు రందఱు
వనితా నే వల్వ నెంతవానికి నైనన్
వినుమా యేమని చెప్పుదు
ననవిల్తుఁడు నాకు సాక్షి నలినదళాక్షీ. 86

గీ. ఇన్నిమాటలు పనిలేద యెన్ని చూడఁ
దెలియఁజెప్పెద నిటువానిఁ దేకయున్న

మానవతి కోక వెనుకను మాన మేల
ప్రాణమునకును సందేహపడును జూడ. 87

వ. నాకు నీవు కావలసినదాన వేని వేగిరంబ వాడున్న
చోటుకుం జని తోడి తెమ్మనిన నది యిట్లనియె. 88

ఉ. అక్కట వాసివన్నె గలయట్టికులంబునఁ బుట్టి రూపుచే
నెక్కుడు భాగ్యసంపదల నెన్నఁగ నెక్కినదాని కంతలో
నొక్కడివానికిన్ వలచి తెవ్వరొ వానికులంబు విన్న వా
రొక్కట నవ్వరే విడువు ముత్పలలోచన నీకు మ్రొక్కెదన్.

ఉ. నిచ్చలు నిండ వల్లభులు నీకడ గానఁగలేక కానుకల్
దెచ్చి తమంత గ్రందుకొని తేకువ మోసలు గాచుచుండగాఁ
జెచ్చెర వారలం ఘనము సేయక డాయకయూరకున్న హా
యెచ్చెముగాదె నీకునుబయోరుహలోచనయీపురంబునన్.

చ. కలికితనంబు మీఱఁగ వికారముతోడ మనోజకేలి ని
శ్చలతమకంబు పుట్ట విటసంఘముఁదెచ్చి యొసంగు నీమహో
జ్జ్వలమణిభూషణాదిఘనవస్తువులం దనురక్తిగాక తా
వలచుట పంతమే ధరణి వారవధూమణికిం దలోదరీ! 91

వ. అని యనేక ప్రకారంబులం దెలిపిన రుచియింపనిచందంబున
చెలిపలుకులు హితవుగాక మదనావలోకనవిరహవేదనా
క్రాంతశాలి యగునాకాంత క్షమాక్షరంబులఁ జెలి కిట్లనియె.

ఉ. ఎన్నిక మీఱఁ గన్నులకు నింపగువాని రమింపలేని య
త్యున్నతరూపసంపదయు నొప్పగుజవ్వన మేల చెప్పెదన్
వన్నెగ నే గడింపనిసువస్తువు లేమియు భూమిలోపలన్
పొన్నసుగంధి యున్నవని బోల్ప గుణంబు తలంపవచ్చునే.

క. కాదనక వారకామిని
గాదే యలరంభ వలచి కానలవెంటన్
బోదె నలకూబరునకున్
వాదింపఁగ నేల జగతి వలచినపనికిన్. 94

ఉ. ఏటికి రత్నభూషణము లేటికి దివ్యసుగంధసంపదల్
యేటికి భామినీమణుల యిచ్చయెఱుంగని యావిటాధముల్
యేటికి నామనంబునకు నింపగువానిని దేఁకయుండినన్
బోటిరొ యింక ప్రాణములు పోల్పుగ నిల్వవువానిఁదేఁగదే.

వ. అని ప్రియంబుగూర్చి వానిందెచ్చిన నీకు మెచ్చుగలదనిన నయ్యేణలోచన పచ్చవిల్తుం డున్నయెడకు వచ్చిన సుగుణావతి దనలో నిట్లనియె. 96

క. చనునొకో చెలి యచ్చటికిని
ననునొకో నామాటలెల్ల నాతనితోడన్
వినునొకో వివరము పుట్టను
గొనకొని యలపనికి నియ్యకొనునో లేకన్. 97

ఉ. వచ్చునొ రాడొ యిచ్చటికి వచ్చి నిజంబుగ నన్నుఁజూచి లో
మెచ్చునొ మెచ్చడో పిదప మెచ్చిన రమ్మని కౌఁగిలించునో
యిచ్చలుమీఱ వేడుకను నిద్ధరలోపల నాకుఁ గీర్తిఁ దా
దెచ్చునొ తేఁడొకో యనుచు ధీర దలంక కలంకులోపలన్.

వ. అని తలపోయుచుండె నంత సుగుణావతి బంపినచెలి చని భీమేశ్వరుని ముఖమంటపంబునకుఁ బ్రవేశించి తత్ప్రదేశంబున నున్న క్రొన్ననవిల్కాని నీక్షించి యాశ్చర్యసంతోష ప్రేమాతిశయంబులు తనమనంబునం బెనంగొన సుగుణావతి చెప్పినమాటలు నిజంబుగా నెఱిఁగి యతని నాలోకించిన

భామినీమణులు చిక్కక తక్కుదురే యని తలంచి యేను నితనికి వలచియుండితినేని ప్రాణసఖకార్యంబు దక్కదని సరసురాలును వివేకియుం బ్రౌఢాంగనయుం గావున మనసు దిరుగ నూలుకొలిపి ధైర్యంబు దెచ్చుకొని యిట్లనియె. 99

సీ. ఎందుండి వచ్చితి రెవ్వరు మీపేరు
యొక్కడి కేగుదు రెఱుఁగఁ జెపుడు
ప్రేమతోడుత విచారించితుఁ జూతుము
వరుస నిందరుగనివారు లేరు
నీరూపు రేఖలు నీరాజసంబును
నరులయందును బుట్ట వరసిచూడఁ
జర్చింప దేవతాంశమువారు గాఁబోలు
దురుగాని యన్న నితరులుగారు
పొందుమీఱఁగ మీర లీపురమునకును
వచ్చియుండినఁ జూచినవారికెల్ల
నతులసంతోషమును జాల నద్భుతంబు
వదలి హృదయంబులందును ముద మెలర్పు. 100

క. విచ్చేయుము మాయింటికిఁ
జెచ్చెర పుష్పములు మంచిగంధము విడెముల్
బుచ్చుకొని వత్తు రంటిని
నిచ్చట నుండంగ మీకు నేటికి ననఘా. 101

వ. అనిన మందస్మితసుందరవదనారవిందుండై యిందిరానంద నుం డిట్లనియె. 102

ఉ. వారిజపత్రలోచన యవంతిపురంబుననుండి వచ్చితిన్
పేరు మనోహరుం డనఁగఁ బెంపువహించినవాఁడ నెన్నఁగా

ధారుణి నెల్లవిద్యలకు ధామ మనం దగుదక్షవాటి యిం
పారుసుఖోపవాసమని వచ్చితిఁ జెప్పఁగఁ జూచువేడుకన్.

వ. విను మే నొక్కరాజపుత్త్రుండ నితండు మదీయమిత్త్రుం
డొకకారణంబున వచ్చితి మిటకు నని తనవృత్తాంతంబుఁ జెప్పి
నీవెవ్వరిదానవు నీపే రేమనినఁ దత్కాంతామణి సంతో
షించి యిట్లనియె. 104

చ. వలచితి వేను మాయలను వారగసేయఁగ నట్టిబాసలుఁ
వడివడిఁజేసితేని యొడసేయరు పల్లవకోటిఁ జేరి య
గ్గలముగ మానముఁ ధనము గైకొని తక్కుదు రెంత
వారికిఁ, వలువరు పాపపుంజములు వారవధూమణు లేమి
చెప్పుదున్. 105

గీ. ఒకరివద్దనుండి యొక్కట నొక్కని
కన్నుసన్నఁ జేసి కడురయమున
గవయ నొకనిమోహకార్యంబు లొక్కని
యొడల నిలుపుకొందు రింతు లెల్ల. 106

గీ. ఎంత ప్రౌఢైన లంజవారింటి కెల్ల
ముందు వెల పంపకను బోవరాదు గాన
తరుణి యీవేళ మాచేత ధనము లేదు
యిందు జాణల కౌచిత్య మెఱుఁగవలయు. 107

వ. అదియునుంగాక కార్యార్థంబుగా వచ్చితి మింతియేగాని
యిచ్చోటికి వచ్చినవారముం గాము నీవు ప్రియంబుగూర్చి
రమ్మని పచించెదవు మదీయ ప్రకారంబు వినుము భవదీయ
మందిరంబునకు వచ్చి సుగుణావలిం గలసి సుఖంబున నుండు

వాఁడ నింతిరొ కాని పచ్చపైకంబు నేను వెచ్చంబునకుం బెట్ట సమర్థుండఁగాను. అదియునుంగాక యెంతధనవంతుడు వచ్చిన తన్ను నుపేక్షించిపోయిన మాకుంగాదు అప్పుడు విడుచుట కంటె రాకయుండుటే లెస్స యీవిధంబంతయు మీ యక్కకుం దెలియఁ జెప్పి రమ్ము పొమ్మనిన యక్కొమ్మ యక్కమ్మవిల్తునిం బోడొకని సుగుణావలికడ కేగి యిట్లనియె.

చ. తరుణిరొ నీవు చెప్పిన విధం బటు తప్పదు పోయి చూచితిన్
ధరణితలంబులోన నతిధన్యుఁడు చక్కనివాఁడు వాఁడెపో
పురుషులలోన వాని సరిబోల్పను జెప్పను జూపరాదు బో
పరమవివేకసార యొకపాటిమనుష్యులఁ జూచి మెత్తువే. 109

క. తనపేరు తగ మనోహరుఁ
డని చెప్పి యవంతినుండి యరిగితి మిటకున్
ఘన మగుసిరిగలయింటను
జనియించితి ననియె నతడు చందనగంధీ. 110

క. నీరూపును నీవయసును
నీరసికత్వమును పేరు నేరుపుమీఁఱన్
గారవమున మాయింటికి
రారమ్మని బిలువ నతఁడు రాఁ డెంతైనన్. 111

వ. అని మఱి యతం డాడిన తెఱంగంతయు పూసగూర్చిన యట్లు చెప్పిన నప్పొలతి మూర్ఛిల్లి యద్దూతికారత్నంబు చేయు శిశిరోపచారంబులఁ గొంతదడవుకుం దెలిసి చెలియం జూచి యిట్లనియె. 112

శా. ఓకాంతామణి యింత చేసితిగదే యూహింప నీధాత్రిలో
నీకంటెన్ గడునేర్ప రెండుఁ గలదే నిక్కంబు చర్చింపఁగా

నేకార్యంబును జేయలే కిటకు నీ వీలాగునఁ వచ్చితే
నాకాంతుం గొనివత్తు నీవనుచు నే నమ్ముంటి తేవైతివే. 113

క. తనకంటె రూపవంతుని
దనకంటెను కులమువాని ధైర్యాధికునిఁ
వనజాక్షి యిందుఁ బిల్చితె
గనుగొన ధన మెంతయైన గలలోనైనన్. 114

వ. సకలపదార్థంబు మనయింటను గలదు తానేమియు నీ
వలదు కుబేరునంత ధనవంతుడువచ్చినను తన్ను విడువ నని
చెప్పిన నచ్చెలి నయ్యంగజుకడకుం బోయి యిట్లనియె. 115

ఉ. తప్పక నీవు చెప్పినవిధంబున సామజయానతోడుతఁ
జెప్పితి నన్నియుం దడవు సేయక యింటికి నేగుదెంచి మా
కప్పురగంధి చేకొనుము కాదన నేటికి నన్నిమాటలఁ
జెప్పెడి దేల రమ్ము గుణశేఖర నీవ యెఱుంగు దారయన్.

క. ఇంగిత మెఱుఁగరు జాజులు
మంగలమున వేచనేల మానిని దయతో
డం గలసి గారవింపుము
సంగతి మీఱంగ నీవ సంపద మాకున్. 117

క. మదిరాక్షి నీదు నీవికి
మదిలో నాసింప దెప్పుడు మానితగుణసం
పద చాలఁ గలదు గృహమున
ముదమున రావయ్య నీవు మోహనమూర్తీ. 118

గీ. నిన్ను వేడుకఁ గూడిన నీరజాక్షి
యెంత యిచ్చిన పరవిటు నేల గలయుఁ

గోరి వెన్నెలఁ గ్రోలుచకోరములకుఁ
బరఁగఁ దక్కినరుచులెల్లఁ బథ్యమగునె. 119

వ. అని యనేకప్రకారంబుల నొడంబఱచు బోటిమాటలకుఁ దుంటవిలుకాఁడు సమ్మతించి సుగుణావతియింటికేతెంచి. 120

చ. ప్రకటితబంధసంగతులు వ్రాసినచొక్కపుమేలుకట్టులకా
సఖయల మంచముంఖరచు చల్లనిపువ్వులపాన్పు బ్రోదిరా
శుకములు వీణెయుం సురటి యున్నరసొంపుగఁగల్గి పైఁడిజా
లకముల మేడమీఁదను విలాసముస్నతి నొప్పు మెప్పుగన్.

సీ. పాయక కమలసంభవుకూఁతుఁ జెఱబట్టి
నేర్తెఱ వెనువెంట నేగువిధము
జంభాసురారియు సంభ్రమంబున వచ్చి
గౌతమునిల్లాలిఁ గవయుతెఱఁగు
తనతపోవిధి మాని ఘనపరాశరమౌని
కణఁగి యోజనగంధిఁ గవయురీతి
చందురుండును సురాచార్యునిసతిఁ జూచి
యరసి మోహించినయట్టిరీతి
నసమనయనుఁడు దారువనాంతరమునఁ
గాంతలను భ్రమియించెడు వింతలాగు
గోపికలఁ గృష్ణుఁ డలయించు క్రొయ్యదనము
మింట పొసపరినిండ చిత్రించినాఁడు. 122

వ. ఇట్టిచిత్రంబుల నొప్పినఘనసారకుంకుమసంకుమదకస్తూరికాగరుగంధసారమిళితపరిమళభోగంబును వివిధవిటపకుసుమవికసితసంవాసితంబును నగుమేలిమైనలోపల ప్రవేశించి.123

క. విరహాభరంబున నెరియుచుఁ
బరవశమునఁ జిక్కి పువ్వుపానుపుమీఁదన్
బొరలెడుసుగుణావతి న
మ్మరుఁడు విశేషముగఁ గలసె మక్కువమీఱన్. 124

ఉ. కాలములున్ బ్రమాణముల కందువులున్ దగ జాతివశ్య
ముల్, మేలిమిచూపులున్ జతురవేళల బాహ్యరతిప్రసంగ
ముల్, చాలనెఱింగి కూడుసరసంబులనేఁతల నీడుజోడులై
వ్రాలి తనూతనప్రకటబంధవిశేషము లెల్లఁ జూపుచున్. 125

చ. కలికితనంబు లుల్లసితకాంతులు నిండి తొలంగు టొక్కబా
గులతమకంబు లింపొదవఁ గూరిమి చాలఁగ బుట్టఁజేసి నే
ర్పులకడలేనికూటముల పొందగు మాటల బుజ్జగింపుచున్
గలసి పెనంగి రొక్కటను గాంతుడు కాంత యనేకభంగు
లన్. 126

చ. వెస గళనాదముల్ మెఱసి వేడుక గాఢములై చెలంగఁగా
పొసఁగినహృద్యవాద్యములపోల్కి నితంబభరంబునందు వె
క్కసముగఁగింకిణుల్ మెఱయఁగాంతునియూరుతదగ్రవేదికన్
బసదళుకొత్త భావనవపాత్రగ నాడె విచిత్రలీలలన్. 127

గీ. సరసగతులను మోహంబు పెరుగురతుల
తత్తరింతల నెడ లేనితమకములను
బగలు రేయును దెలియ నేర్పఱుపరాక
మరునిసేఁతల నితరంబు మఱచె రతుల. 128

క. నానావిధముల మోహము
నానాఁటికిఁ బొదలఁ బొదల నవరసగతుల

స్థానము ప్రాణము ధనమును
మీనాంకునిసొమ్ముఁ జేసి మెలఁతుక యుండెన్. 129

వ. ఇవ్విధంబునసుగుణావతిదినదినంబునకుఁ రుచి మచ్చిక పెరుగఁ
బచ్చవిల్తునిం ఘనంబుగఁ జూచి సుఖం బుండె నంత. 130

ఉ. ఖండేందోదితజూటపన్నగగతిగ్రైవేయబాహాబలో
ద్దండప్రాభవసాహసోగ్రపటువేదండాసురేంద్రాత్తకా
ఖండిదుష్కృతభవామరార్చితలసత్కారుణ్యపాథోనిధీ
చండీశ స్తవనీయదక్షనగరీశా యీశ భీమేశ్వరా. 131

క. బాణారి బాణసురగిరి
బాణాసన బాణవరద ఫాలాక్ష జగ
త్ప్రాణాశన కంకణనుత
పాణీశ నుతీశ భక్తవత్సల యీశా. 132

గద్య. ఇది శ్రీవీరభద్రకరుణావిశేషమహితచారిత్ర తిప్పయా
మాత్యపుత్ర సరసజనవిధేయ నూతనకవి సూరయనామధేయ
ప్రణీతం బయినసకలజనాభిరామం బగుధనాభిరామం బను
మహాకావ్యంబునందు ద్వితీయాశ్వాసము సంపూర్ణము.

# తృతీయాశ్వాసము

క. శ్రీమత్పర్వతపతిపు
త్రీమహితాననసరోజదినకర వరసు
త్రామచతురాస్యదాతా
రామ శ్రీభీమనాథ రాజార్ధధరా. 1

క. వినవధరింపు ధనదుం
డనిమిషపతియొద్ద సభికు లందఱు వినఁగా
మనసిజునితోడ నాడిన
తనపరమగుప్రతినఁ దీర్ప ధరణికి వచ్చెన్. 2

సీ. మెఱుఁగారుమువ్వన్నె మెఱయు బెబ్బులితోలు
కటితటిఁదిండుగాఁ గప్పె నడుమ
పద్మరాగప్రభాపటలంబు విలసిల్లు
డంబైన వొడ్డియాణంబుఁ బెట్టి
కర్పూరరజముతోఁ గలహించు నునుభూతి
సర్వాంగములయందుఁ జాల నలఁది
పొలుపొంద నవరత్నములకాంతి వెదజల్లు
కుచ్చులగంతమైఁ గుదురుకొలిపి
శిరము ముత్తెలవిరులును శింగినాద
మమర వజ్రాలకామాత్తు లర్థిఁ దాల్చి
నొసల కస్తూరిబొట్టిడి యొసఁగ యోగి
రాజరూపంబుఁ దాల్చె నారాజరాజు. ౩

గీ. క్రమముతోడుత నవనిధానములుఁ గదిసి
శిష్యులై తన్ను సేవింపఁ జిత్రలీల
నాదినాథుండు దా నైన యట్లు నిలిచె
నేచి జను లెల్ల నంతంతఁ జూచి మ్రొక్క. 3

శా. సాక్షాద్బాలశశాంకమౌళి యని యాశ్చర్యంబుతో నంద
ఱున్ వీక్షింప న్నిధులోలి ఛాత్రగణమై వేమాఱు సేవింపఁగా
యక్షాధీశ్వరుఁ డేఁగుదెంచె మది నత్యుక్తప్రయత్నంబుతో
దాక్షారామను భాగసీమను మహోద్యన్ముక్తిసద్భావకున్. 4

చ. పరిఘులవప్రసంఘముల భర్మ్యవినిర్మితసౌధవీథులన్
విరచితగోపురావళుల విశ్రుతరత్నసుగేహపఙ్క్తులన్
సరసతఁ జూడ నొప్పె సురనాథపురంబునఁ బోలఁజాలు బం
ధురవరకామినీమణి వినూతనపేటికి దక్షవాటికిన్. 5

వ. అరుదెంచునపుడు. 6

సీ. క్రమమున బాలభారద్వాజములు వచ్చి
చేరువపచ్చనిచెట్లవ్రాలె
తొలఁగక చమరుపోతును మయ్యసంబును
ఱొడమదిక్కుననుండి కుడికి వచ్చె
కలకల మని పక్షి గలిసి పైఁ జేసెను
కడసి ముందర క్షేమకారి యాడె
బాగొందఁ బూర్ణకుంభము లెదురుగా వచ్చె
కల్యాణ మగుచోట గాలి వలికె
యేచి గణికాసమూహంబు లెదురు వచ్చె
మంచిమాటలు వినవచ్చె మించి కెలన

వెడల ననుకూలవాయువుల్ విసరె మీఁద
మేటిధనదుండు శ్రీదక్షవాటి చొరఁగ. 7

వ. ఇట్లు దనకు నైన శుభసూచనంబు లగుశకునంబులం గనుం గొని తనకార్యంబు సఫలం బగుట తథ్యం బని మనంబున నిశ్చయించి శిష్యులుం దానును గుహ్యకేశ్వరుండు భీమేశ్వరునగరు కేతెంచి. 8

సీ. పొలుపొంద నెలనెలఁ బూచి వెన్నెలచల్లు
చిన్నిపువ్వులఁ దాల్చువన్నె కాని
మెరవడి కమ్మ తెమ్మెరతావి మెఱుగెక్కు
వడగల తొడవుల తొడవువాని
మురియుచుంగులు దీర్చి మువ్వన్నె నునుఁదోలు
గప్పుపుట్టము మొలఁ గట్టువాని
వడఁకుగుబ్బలరాచవారిముద్దులపట్టి
సామేన నిడుకొన్న బూమెకాని
యేచి తెల్లనిగిబ్బపై నేఁగువానిఁ
బొసఁగ ముమ్మొన కైదువ పూనువాని
మించి యొందును దానయై మెలఁగువాని
వేలుపుల కెల్లఁ బెద్దయై వెలుఁగువాని. 9

ఉ. సాని చకోరలోచనల చక్కనివట్రువగుబ్బచన్నులన్
మీనపతాకముద్రలు సమేళముగాఁ జిలికించి మించి యా
పూనినవేడ్కలం బొదలుచుండెడి వేదుకకాని దక్షవా
టీనిలయున్ సితాంబుజపటీరశుభాంగుని భీమనాథునిన్. 10

వ. భక్తిపూర్వకంబుగా దర్శించి యద్దేవుని యనర్ఘ్యమణిని కరంబులం బూజించి గంధపుష్పనైవేద్యషోడశోపచారంబు

లాచరించి హస్తకమలంబులు మొగిచి నిటలతటంబున ఘటియించి యిట్లని స్తుతియించె. 11

జయజయ సకలసురాసురపూజితపాదారవింద భవదమలంకృత దివ్యదేహా, దేహజదర్పాంధకారోగ్రచండమార్తాండా, తాండవక్రీడా సముద్దండ విభ్రమభ్రమణచకిత సకలదిశాచక్ర చక్రధర నయనాంబుజ పూజిత పాదపంకజాత, జాతివృద్ధి క్షయాదిరహిత ప్రభావభాసురనిత్యకల్యాణ ధాత్రీధర చటులకోదండదండధరోద్రేకభుజబలాటోపసంహార హారఘనసారనీహారపటీరమందార హీరడిండీరమందార సుందారవర్ణవర్ణిత వేదవేదాంతశాస్త్రాగమపురాణేతిహాస సముదయావలోకన శిక్షితభక్తలోక లోకలోచన సుధాంశు ధనంజయనేత్ర నేత్రానలభస్మీకృతపంచబాణ, బాణాసురపూజిత, జితపురత్రయీశ చతురగంధర్వగంధర్వగానామృతానూనవిభవ భవకంజాతసంఘాత గంధసింధూర సింధూరవిమలచర్మాంబరా...కనదిమకుటశోభిత విశేష శేషపతి మదిమలయ లయకాలమూర్తి ప్రభావిభాసిత సితకిరణదశదిశ కిరణిధరణిజల గగనవహ్నితవహపవనాత్మజవిలసితాష్టమూర్తిప్రభావ భావనాతీత యతీతానాగతవర్తమాన జ్ఞానావధాన యవధానాశివంధ్యం నతత్వరహస్య. పరమయోగీంద్ర హృత్పద్మ కర్ణికామధ్యనివాస వాసవైశ్వానరవైవస్వతవాసవారివనధీశ వాయువైశ్రవణి ప్రముఖదిక్పాలక నిరంతరసేవిత నిఖిలైశ్వర్య మూలస్తంభ స్తంభోద్భవ మహాత్వమహిమాద్యంతరహిత హితభక్తజనమందార దారువనస్థాన మునిజనకామినీమనో

విభ్రాంతకారణ దిగంబరాకారసంచార చారుతరశృంగార
శృంగారాది నవరసాలంకారదివ్యావతార తారకాధీశ్వర
శకాధర ధరాధరకన్యకాముఖకమలభృంగ భృంగీశపటు నట
క్రీడావినోదసంతుష్టచతుర చతురవిహీనదక్షసవనక్రియా
సంహారదక్ష దక్షపురీశ్వరా యీశ్వరా మహాదేవా దేవాది
హృద్భ్రమా భీమేశ్వర యీశ నమస్తే నమస్తే నమః.

ఉత్సాహ.—

సామగానలోలగజనిశాటదుర్ద్దాంతకా
సామజాస్యజనక! ఫాలచంద్రజూటశంకరా
కామితార్థఫలదచారుకాద్రవేయహారసు
త్రామవినుత రజతశిఖరిధామ భీమలింగమా! 13

వ. అని స్తుతియించి యాదేవుని నైవేద్యంబునకు సువర్ణనిష్కంబులు నూరుపూజరులం బిలిచి యిప్పించి యక్కడఁ గదలి వచ్చి రంగమధ్యంబునం గూర్చుండి. 14

గీ. ఘనత భీమేశ్వరునిసమ్ముఖంబునందు
నాట్య మతిచిత్రముగ నాడునలినముఖుల
కెల్ల మణిభూషణములు శోభిల్ల దివ్య
వస్త్రములు నిచ్చె నచ్చోటివారు భ్రమయ. 15

క. మేలిమిఁ గని జూచెడునటు
సోలుచుఁ దనలోన మిగులఁ జొక్కుచు జోగి
మేళము వారికి నెల్లను
జాలఁగ ముడిగట్టి ధనము చాలఁగ నిచ్చెన్. 16

*ఇది ముద్రితప్రతులందుఁ గానరాదు.

క. అదిగాక భీమనాథుని
వదలక కొలుచున్న వారవనితల కెల్లన్
ముదముగఁ జీరలు సొమ్ములు
వెదజల్లినరీతి నిచ్చె విస్మయ మొదవన్. 17

వ. అక్కడఁ గొంతతడ వుండి భీమేశ్వరునిముఖమంటపంబునకు నేతేర ముందర శిష్యులు గొందఱు రయంబునం జని నవనీహారవాఃపూరంబులు చిలికించి మృగనాభిపంకంబున సమ్మార్జనంబుచేసి కెలంకుల మణిరంగవల్లికలు దీర్చి రత్నకంబళంబులు వరచి హంసతూలికావిరచితంబులగు వెలిపట్టువారగు నిలిపి, చిత్రాంశుకంబులు మేలుకట్లు గట్టినతత్ప్రదేశంబున కేతెంచి సుఖాసీనుఁడై యుండె నప్పుడు. 13

గీ. ఇతఁడె మనపాలిభీమేశుఁ డిన్ని యేల
యనుచు వెనువెంట నేతెంచి రాదరమునఁ
గోరి యాదేవదేవునిఁ గొలిచియున్న
సానిరమణులు భోగముజలజముఖులు. 19

క. బాగుగఁ గడువాసించిన
బాగాలునుఁ దెల్లగానుఁ బండినయాకుల్
ప్రోగులుగఁ బోసి వలసిన
లాగున వీడెములు వెట్టు లక్షలు వెలయున్. 20

వ. అప్పుడు దక్షవాటికాపురంబున గలజనంబులు మహాద్భుతానందచేతస్కులై యాతని నాలోకించి. 21

సీ. నిటలాంబకముచేతి నిశితశూలము దాఁచి
జగతి కేతెంచినశంభుఁడో కాక

గరుడవాహనము శంఖముఁ జక్రము దొఱంగి
వినువీథి విహరించువిష్ణుఁ డొక్కొ
బిగిమించు నాలుగుమొగములు దొలఁగించి
యీరీతి నున్నవాగీశుఁ డొక్కొ
కనుపట్టు తనవేయుగన్నులు నడఁచి యీ
నటన దాల్చినసురనాథుఁ డొక్కొ*
నిట్టి యైశ్వర్యమహిమయు నిట్టి సిరియు
నిట్టి చాతుర్యబుద్ధియు నిట్టి విభవ
మిట్టి తేజంబు నరులకు నేల కలుగు
మనల రక్షింప వచ్చినమాయగాక. 22

చ. తనరినసిద్ధముఖ్యులు ముదంబున దగ్గఱి శిష్యసంఘమై
తను నిరుపంకలం గదిసి తద్దయుఁ గొల్వఁగ నాదినాథుఁ డీ
యనువున ధారుణీవలయ మక్కట చూడఁగవచ్చెఁ గాన
యం, దును మఱియూరజోగులకుఁ దొరపుటీమహిమేల
కల్గెడున్. 23

వ. అని సకలజనంబులుం గొనియాడుచుండ నంత. 24

చ. కలువలు నిక్క దమ్ములమొగంబులు ముచ్చ ముడుంగ, నింగి
జుక్కలు మొనకట్ట మొత్తములు గట్ట విహంగమపక్షి
సిద్ధముల్, నెలకొని చారుకోకముల నెమ్మనముల్ వెగడొంద
నన్నిదిక్కులఁ దమసంబు వర్వ రవి గ్రుంకెను పశ్చిమదిక్త
టంబునన్. 25

వ. ఆలోన. 26

---

* దేవలోకము వనియుం దేహచిహ్నము విడి దేవేశుఁడైన దేవేంద్రుఁ
డొక్కొ.

చ. తపసికిఁ గంటిపాప, కుముదంబులజీవనరక్ష, పెద్ద వే
లుపుతలపువ్వు, మేలిసురలోకము పాలిటి బువ్వ, లచ్చితో
రపుసయిదోడు, చుక్కలకు రాజు,మనోజుని మేనమామ,నాఁ
గ పసఁ దోలంకచందురుఁడుగానఁగవచ్చెను పూర్వదిక్కునన్.
వ. సిద్ధుం డారాత్రి పురంబులోనం గలవిద్యలవారినెల్ల
రావించి వివిధవస్తువ్రాతంబులఁ బ్రీతులం జేసియుండెనంత.28
చ. మనసిజుఁ డోడు నింక ననుమానము లేదని చాటురీతి మే
దిని విహగవ్రజంబు నలుదిక్కులఁ గూయఁగ నవ్యతేజముల్
పొనుఁగుపడంగ నెంతయును బొందుగ నిండి వెలుంగు
వేడ్కతో,నినుఁ డుదయాచలంబు తుద యెక్కి జగంబులు
చూచి మ్రొక్కఁగన్. 29
వ. ఇట్లు సూర్యోదయం బగుటయు సిద్ధవరుండు సముచిత
క్రియలు దీర్చి శిష్యులు సేవింప నుండె నప్పుడు. 30
ఉ. చూతములందు సిద్ధుని విశుద్ధచరిత్రుని బుణ్యవర్తను
వీతసమస్తకల్మషుని విశ్రుతవైభవుఁ డంచు నందఱున్
గౌతుక మొప్ప నిష్ట మగుకానుక లెల్లనుఁ గొంచువచ్చి సం
ప్రీతి సమర్పణంబు లొనరింపుచు వేడుకనుండి రక్కడన్.31
వ. మఱియు నప్పుడు. 32
సీ. వడి నాలుబిడ్డల విడిచివచ్చిన విటుల్
ద్రిమ్మరులై భూమిఁ దిరుగువిటులు
కులశీలవర్తనంబులఁ బాసినవిటులు
వెస లంజసందులు వెదకువిటులు
చెడి గుళ్లపంచలు చేరియుండెడువిటుల్
పలుకకుండినఁ బోని పందవిటులు

కలహంబె బ్రతుకుగాఁ గాలుదువ్వెడివిటుల్
చేరి యాసలఁ బని సేయువిటులు
వెల్లి పోలేక మోములు వ్రేల్చు విటులు
నింటి చుట్టునుఁ దిరుగాడు గొంటువిటులు
[1]బాస లిచ్చిన తెర ధూపార్తివిటులు (?)
మొదలుగాఁగల విటులెల్ల ముద మెలర్ప. 33

వ. చనుదెంచి సద్వినయభయభక్తిపూర్వకముగా సాష్టాంగదండప్రణామంబు లాచరించి నిలచినఁ జూచి సిద్ధముఖ్యుఁడు వారలతారతమ్యంబులకుఁ దగినవిత్తంబు లొసంగినఁ జేరి సేవచేయుచుండి రంత. 34

క. అనువుగ నతనిమహత్త్వము
విని నానాజాతిఁ గల్గువేశ్యలు మోదం
బున వచ్చి మ్రొక్కి- నిల్చినఁ
గనుఁగొని సిద్ధుండు వారిఁ గరుణాదృష్టిన్. 35

సీ. కమ్మలు పచ్చలకడియాలజోళ్లును
పతకంబు మొలనూలు బాహుపురులు
పుంజాలదండలు పూదెలకడియాలు
ముంగకల్ రాకట్టునుంగరములు
ముత్యాలపేరులు మొలనూళ్లు డోరీలు
కుంటెనల్ నీలాలకంటసరులు
ముంగాముురంబులు మొగపులతీఁగెలు
సందులదండలు సంపణులును

1 తెలిచి నోరత్తకుండెడి వింతవిటులు ము. ప్ర.

బసిఁడిఱొుత్తులు నేవళా ల్బన్నసరులు
చేరుబొట్లును తాళీలు చెవులపువులు
కదలుమట్టెలు పిల్లాండ్లు మొదలుగాను
బుడమి వెలసిననవరత్న భూషణములు. 36

సీ. వెల్లలు నీటంచు వెలిపముల్ కరకంచు
పట్లురు జిబులును పదకడములు
మంజిష్ఠుకిముకముల్ మాదావళంబులు
కర్పూరవన్నెలు ముత్తెసరులు(?)
తోఁపులు బిరనెతులు గజపొప్పళ్లు
వ్రాతలు పతినిలు రాయగళ్ల
జాళిలు చెరఁగులు సామంతవిధులును
కావులు దసలిలు ఖండసరులు
సర్వశృంగారములు చిత్రచౌకములును
చిన్నకస్తూరిమల్లెను.్లలుకచారు
వన్నియలు మంచిబొమ్మంచువన్నియలును
మొదలుగాఁ గలచీరలు ముదమెలర్ప. 37

గీ. అగురుగంధము పన్నీరు మృగమదంబు
పునుఁగుఁ గుంకుమ పచ్చకప్పురము చాఁదు
గోవ జవ్వాది మొదలుగాఁ గోరి కలర
పరిమళద్రవ్యములు వెట్టి బంధురముగ. 38

గీ. అర్థి నేతెంచి తను వే.డినట్టివారి
కెల్ల వలసిన వెల్లను గొల్లలుగను
యిచ్చి యందరిమనసుల మెచ్చ జేసి
తనమహత్త్వంబు చూపె నాథనదవిభుఁడు. 39

వ. ఇవ్విధంబున తనధనంబుచేతఁ బురంబునం గలజనంబులం దన వశ్యంబు చేసికొని మహామహిమతోనుండ సుగుణావతియొద్ది దాసి యొక్కతె యక్కడికివచ్చి చూచి యివ్విధం బంతయు దనయక్కకుఁజెప్పెదఁగాక యని రయంబున నేతెంచి సుగుణావతి తల్లి యగువిటరంపముతోడ నిట్లనియె. 40

ఉ. చెచ్చెర నీకు నేమనుచుఁ జెప్పుదు సిద్ధుఁడొకండు నూరికిన్
వచ్చి వినూత్నరత్నవరవర్ణితభూషణదివ్యమూర్తియై
మచ్చిక భీమనాథుముఖమంటపసీమ వసించి చూడఁగా
వచ్చినవారి కెల్లను నవారితవస్తువు లిచ్చు మెచ్చుగన్. 41

చ. వదలక సిద్ధుఁ డెంత ధనవంతుఁడొ నీవటువచ్చి చూడు మా
యెది మనవాడసానులకు నెల్లను దివ్యసుగంధవస్తువుల్
పదకము లాదిగాఁ గలుగుభాసురరత్నవిభూషణాదు లిం
పొదవఁగ నిచ్చెఁ జేరి వినయోన్నతి నందఱు భక్తిసేయఁగన్.

క. పురి గలవారాంగనలం
దరుదుగ విటసంఘములకు ననురాగముతో
వరరత్నభూషణాంబర
పరిమళసంచయము లొసఁగె బంధురలీలన్. 43

క. అతిముదమున మనసుగుణా
వతిఁ జూచిన మిగుల మెచ్చి వరరత్నసమం
చితభూషణాదు లిచ్చును
హితమతి మన్నించు సిద్ధుఁ డిందఱికంటెన్. 44

వ. అనిన విని యత్యద్భుతాక్రాంతచిత్తయై కువిటవిషవల్లి యగు లంజతల్లి క్షణంబును నచట నిలువఁ దాలిమి లేక వేదనం బొరలి యేవిధంబుననైన నతనిం దమగృహంబునకుం

దెచ్చి యల్లునిం జేసికొని సకలధనంబులనుం గొందునని దాసియుండానును సిద్ధునిం డాసి దండప్రణామంబు చేసినం జూచి యాతండు వారికిం దగినవస్త్రభూషణంబు లొసఁగిన నవ్విటరంపంబు పునఃపునః ప్రణామంబు లాచరించి హస్తం బులు మోడ్చి యిట్లనియె. 45

సీ. ఇల జాణ లగువారు నీదకువాటికి
వత్తు రేఁ జూడనివారు లేదు
యీరాజసక్రియ యీవైభవస్ఫూర్తి
యీదానగుణము మఱెవ్వ రందు
కని యెఱుంగము వినియును నే మెఱుంగము
చెప్పఁ జిత్రము మీవి శేషమహిమ
ధర్మాత్ముఁడవు భవద్దర్శనంబునఁ జేసి
యందఱు జాలఁ గృతార్థులైరి
చేర నీసేవ సత్తుగాఁ జేయునట్టి
వారలకు నెల్ల ఘన మైనవైభవములు
రూఢి మాపాలిభీమేశ్వరుండ వీవె
శ్రీకరోన్నతగుణధుర్య! సిద్ధవర్య! 46

క. విచ్చేయుఁడు మాయింటికి
చెచ్చెర నీవేళ భిక్ష నేయఁగవలయుౕ
మెచ్చుగ శిష్యులు మీరును
సచ్చరితానందవిభవచాతుర్యనిధీ!. 47

వ. అనిన సిద్ధపుంగవుం డిట్లనియె. 48

చ. తలకొని వేడ్కతో నవనిధానములుం దనయొద్ద నెప్పుడుౕ
గల వదిగాక శిష్యులముఖంబున వచ్చుసమస్తవస్తువుల్

పిలచిన నెవ్వ రింటికిని భిక్షుకుఁ బోము ప్రియంబుతోడుతన్
పిలిచితి గాన వచ్చెదము పేరును మీచరితంబుఁ జెప్పుమా.
వ. అనిన విటరంపంబు నిట్లనియె. 50
మ. కమనీయంబుగ నాడఁ బాడఁ జదువంగా నేర్చు వీణాదివా
ద్యముల న్నైపుణిసొంపు నింపఁగఁ గళాస్థానాంశుతంత్రంబు
లన్,సుమనస్సూత్రమనోజకేళి విటులం జొక్కింపంగా నేర్చు
వి,భ్రమసౌందర్యములందు చాల సరిచెప్పన్ లేరు నాపుత్రి
కిన్. 51
వ. మీ రిచ్చోటికి విచ్చేయు టెఱుంగదు, ఇంతకు దేవర
చిత్తంబు రా సేవ సేయ నేర్చునని తనకులస్థానపౌరుషంబులు
కూఁతురు వినయవిద్యావిభోగరూపాతిశయంబులు ప్రియం
బున విన్నవింపఁ దరహాసితవదనుండై యిట్లనియె. 52
చ. పనివడి నీవు మమ్ము భయభక్తిని రమ్మని పిల్వ రాకమా
నిన క్రియగాదు వచ్చెదము నేఁటికి తప్పదుగాని వారకా
మినులనివాసదేశములు మేలివిటాలికిఁ దానకంబుచే
కొని యొకఁడున్న నచ్చటికిఁ గూళతనం బనఁగాదె వచ్చినన్.
వ. అనిన విటరంపం బిట్లనియె. 54
ఉ. ఇంతను మాన మేమిటికి నిచ్చ మదీయగృహాంతరంబులో
నెంతటివానికి న్నిలువ నెట్లగు నామది నెంచలేకయే
రంతును జేయవచ్చు విటరంపము ముందర నెన్న నేఁటికిన్
గంతునినైన నుద్దవిడి గాసిలఁబె ట్టిలువెళ్లఁగొట్టెదన్. 55
వ. అనిన యట్లకాక యని సుగుణావతికి నవరత్నభూషణాంబర
సుగంధపుష్పతాంబూలాదు లొసంగి వచ్చెదంగాని ముంద
రం బనమన్న నతనియొద్ద తనదాసింబెట్టి మునంబున నరిగి

తదీయనివాసంబు నలంకరించి నతనిరాక కెదురుచూచు చుండె నిట సిద్ధుండు తన్ను సేవింప వచ్చినసకలజనంబుల యథోచితప్రకారంబుల వీడ్కొలిపి శిష్యులు గొలిచి రా నేగుదెంచిన సుగుణావతితల్లి యత్యంతసంతోషంబున నెదుర్కొని పసిండికలశంబుల నుదకంబు దెచ్చి పాదంబులు కడిగి సౌధాగ్రభాగంబున మణిపీఠంబు నునిచి. 56

ఉ. అల్లుఁడు వచ్చె వీఁడె మనయక్కర తెల్లను దీతె రండు మీ
రెల్లను మ్రొక్కుఁడంచుఁ దమయింటఁగలందఱుఁ దెచ్చి
చూపినన్, సల్లలితాంబరాది మణిచారు విభూషణదివ్య
గంధముల్, కొల్లలుగాఁగ నిచ్చె నవె కొండని సిద్ధ
వరేణ్యుఁ డింపునన్. 57

వ. అప్పుడు. 58

గీ. పసిమి గలక్రొత్తయిప్పపూరసముఁ దిగిచి
ఖండశర్కరతోఁగూడ వండి మిగుల
మేలికర్పూరరజముతో మిళితమైన
మంచిసారాయి రయమునఁ గొంచు వచ్చి. 59

వ. ఇచ్చిన నతండు ననర్ఘ్యమణినికరస్థాపితం బగుకొప్పెరఁబట్టి యాస్వాదించి లెస్సగాదని పారజల్లిన నాచిప్పయుం దొలంగ వైచినం బుచ్చికొని లక్షనిష్కంబులు దీనికి వెలగాదని యతని యౌదార్యగుణంబులు గొనియాడుచుండ సిద్ధుండు దాని కిట్లనియె. 60

క. జగతిఁ గలవిద్యలన్నియు
నగణితముగ నేర్చు ననుచు ననురాగముతోఁ

ఓగడితి వెక్కడ కేఁగెను
సుగుణావతిఁ దెమ్ము మాకుఁ జూడఁగవలయున్. 61

క. అనిన విటరంపమును సి
ద్ధునిపాదంబులకు మ్రొక్కి తొయ్యలి నిదె దో
డ్కొని తెత్తు లోన నున్నది
యని కదలె విడంబనంబు నంతయు మెఱపన్. 62

సీ. వాడుఁబువ్వులుఁ బెట్టి కూడదువ్వినయట్టి
చింపిజుంజురుగొప్పు చెంప వ్రేల
నీరెండగన్నుల నిండి కాటుకజాలు
నూడు రెప్పలవెంట నొడ్డగిలఁగ
విచ్చుటాకులఁ బెట్టి విరివిగాఁ జేర్చిన
చెవులు భుజంబులం జేరి వ్రేల
సమ్మతంబుగ నంబికమ్మపాదంబుల
నలరిన పేరులు నఱుతఁ గ్రాల
రమణ మీఱఁగఁ జిరుతచౌకములు ముదుగుఁ
దొగరుఁ బుట్టంబు కటితటిఁ దొంగలింప
మద్యపానంబునను మేను మఱచి మఱవ
నట్టి నటనల విటరంప మరుగుదెంచె. 63

చ. పనివడి రౌండమాపులనుఁ బట్ట వడిఁ వడఁగండ్ల గుల్లి గ
ట్టను గలి వెన్నదీయను విడంబముతోడుతనింద్రజాలముల్

గొనకొని పన్న మంచు వగఁగుంచమునం గొలువంగఁ జట్టురా
తను మరినార వల్వను ముదంబున నేర్పరి యెన్ని చూడఁగన్.

*వ. ఇట్లు చనుదెంచి చేతోజాతచాతుర్యనూత్నలావణ్య మధురామృతపయోధివీచికాసముదయంబులం బ్రియంబులం దేలుచు సోలి పారవశ్యంబునం బొందియున్న సుగుణావలిం జూచి యిట్లనియె. 65

క. మనసున మీరున్నారా
యని చూడవు నిట్టివారి నక్కట చెలులన్
ఘనమతి మన్నింపవు కై
కొన వీతని వలలఁ జిక్కి కువలయనేత్రీ! 66

మ. విను బాలామణి! యేమి చెప్పుదు జగద్విఖ్యాతిగా శిష్య లే
పున సేవింపఁగ సిద్ధుఁడొక్కరుఁడు సొంపుల్ మీఱ నీయూరికిన్
చనుదెంచిప్పుడు రత్నభూషణతతుల్ చాలంగ వారాంగనా
జనసంఘాతవిటాలి కిచ్చె మది నుత్సాహంబు సంధిల్లఁగన్. 67

క. మనవాడవనిత లందఱుఁ
గనకాంబరమణిసుగంధఘనవస్తువులన్
దనిసిరి మఱి నీవొక్కతె
వును దక్క పురంబులోన నుత్పలనేత్రీ!. 68

వ. ఏ నచ్చటికిఁ జూడంబోయిన మన్నించిన వస్తుసంచయంబు చూడు మివే యని ముందరం బెట్టి సిద్ధముఖ్యుండు మననిల

* ఇది ముద్రిత ప్రతిలో లేదు.

యంబున కేతెంచి యింటిమొగసాలవసియించి యున్న వాఁడు చూచివత్తువుగాక రమ్మనినఁ దల్లికి సుగుణావతి యిట్లనియె.

ఉ. ఏలవినూత్నరత్నచయ మేల సుగంధవిశేషవస్తువుల్
చాలవె యింట నున్నమణిజాలసముజ్జ్వల భూషణావళుల్
పోలఁగ పీనితోఁటి రతిఁ బోల సమున్నతి యెన్ని చూడఁగాఁ
గేళి యొనర్చు జోగులను గిట్టరు చెప్పకు తల్లి మ్రొక్కెదన్.

ఉ. ఈగతి మాయ సేయుచును నెప్పుడు యక్షిణిచేత వస్తువుల్
ప్రోగులుగాఁగఁ బెట్టుదురు పోలవు చూచిన విద్యలన్ని యుక్
బాగులు గావు యేటికివి పట్టనుఁ బెట్టను డాఁచవచ్చునే
జోగుల కిట్టిరత్నములు సొమ్ములుఁ గల్గునె ధారుణీస్థలిన్. 71

చ. పలుకులు వేయు నేమిటికిఁ బాయఁగఁజాలను తల్లి వీనికాఁ
గిలి మహనీయచారుమణికీలితభూషణరత్నపంక్తితో
వెల యగునాతఁ డిచ్చుపదివేలును వచ్చెను పోయి యిప్పుడే
చెలువుగ భిక్ష చేసి తగ సిద్ధుని నంపుము చాలు నన్నియున్.

వ. అనిన తల్లితో నాడుచుండుసమయంబున సిద్ధపరేణ్యుఁ డ
పూర్వ మణిభూషణాంబరంబులు సుగంధాదివస్తువులు
పుత్తెంచిన నవియును సుగుణావతిముందటం బెట్టి యిట్లనియె.

ఉ. కోకిలవాణి నీకు నివె కొమ్మని పంపెను సిద్ధముఖ్యుఁ డీ
కోకలు భూషణంబులును కోరినమంచిసుగంధవస్తువుల్
కైకొని పెట్టుదేహమునఁ గాదని నేటికి వెఱ్ఱిబిడ్డ! యీ
పోకలఁ బోవనేల విను పొందుగ నీకును బుద్ధి చెప్పెదన్. 74

ఉ. తేటల మాటలాడి, తరితీపులు చేసి, విటాళిఁ గూడి రో
చ్చోటికిఁ బోవనీక తన సొమ్ముగఁ గైకొని యెల్లసంపదల్
వాటముగా గణించి తనవారలఁ బ్రోచుట కీర్తిగాక యే
పాటను వారకాంతలకుఁ బంతముగా నొకనొద్దఁ జిక్కునన్.

చ. చిలుకలఁ బావురంబులను చింకల హంసల చక్రయుగ్మముల్
వెలివెలు నాదిగాఁ గలుగువింతగుపుల్గులఁ బెంచి మిక్కిలిన్
గలుగఁగఁజేసి పెంచుటలు కన్నులఁ గానక వీనికిన్ వృథా
వలచుట కా సువర్ణమణివర్గము లందుట గాక కోమలీ. 76

ఉ. నాయకి నెమ్మి నీ వనుదినంబు ఘటింపక విత్తమబ్బునే
ప్రాయము రూపసంపదయు భవ్యసమున్నతిదేహకాంతియున్
బోయినయంతమీఁదమఱిపోఁకయుఁబుట్టదువారకాంతకున్
వేయునుఁ జెప్ప నేమిటికి వేగన సిద్ధునిఁ జూడు భామినీ. 77

క. ఇటు నీకు వలచి తిరిగెడు
విటసంఘము లెల్లఁ గూడి విని మది నవ్వన్
కటకట! వలచితి వేటికి
కుటిలాలక కులములోనఁ గొఱఁతలు సుమ్మీ. 78

క. నేరుపుతో నొఁగాదను
వారెవ్వరు లేరు వారవనితల కెల్లన్
ధారుణిఁ దల్లులె కర్తలు
వారింపను బుద్ధి చెప్ప వనరుహనేత్రీ. 79

క. నీతోడికామినీమణు
లాతతమతితో గడింప నచటికిఁ జని వి
ఖ్యాతిగఁ గన్గొని తెలియుమ
యీతెఱఁగున వలచినారె యిందునిభాస్యా. 80

వ. అని యనేకప్రకారంబుల హేతుదృష్టాంతంబులు చూపి
చెప్పిన నప్పొలంతి మనసు దిరుగంబడి సిద్ధుఁ జూచు వేడ్కఁ
దగిలి తదీయభూషణంబులు దాల్చి యిట్లనియె. 81

చ. అరుదుగఁ దల్లి వచ్చి మన కద్భుత మందఁగఁ జెప్పినట్టి యా
పురుషుని సిద్ధపుంగవునిఁ బొందు దలిర్పఁగఁ జూచి వత్తు నా
వరమతి నీపురిం గలుగువారలు పూజలు సేయనొప్పఁ దా
నిరవుగ వచ్చినాఁడు మనయింటికి నిప్పుడు భిక్ష సేయఁగన్.

వ. అనినఁ జేతోజాతుం డాయింతిమొగంబు చూచి వీక్షించి
యిట్లనియె. 83

చ. భవముల కాలయంబులు, కృపామతిహీనులు, దుష్టవర్తనల్
సువినయమార్గవర్జితులు,సూనృతదూరులు,సాహసోదయుల్
భువిఁ గలయెల్లమాయలకు బుట్టినయిండ్లవి చూడ నద్దిరా
శివశివ వారకాంతలను జేరిన దోసము గాదె యెప్పుడున్.

చ. అనువుగ దక్షవాటి నహహా! చెలి మిక్కిలి జాణవంచు స
జ్జనవిటసంఘముల్ మిగుల సన్నుతి సేయఁగ నిందు వారకా
మినుల మతెవ్వరికి మదిని మెచ్చఁగ నిన్నుగుఱించి చూడ వ
చ్చినపస దక్కి కూళపని సేసితి నీవ యెఱుంగు దన్నియున్.

చ. ఇరవొకయింతలేక ధనమిచ్చి వరించిన నీక యుండినన్
సరసత మీఱ నొక్కనివసంబుననుండి ధనంబు చూచి తా
నొరుకడ కేఁగఁ జూచి తిదియొచ్చెముగాదె యిటుంగ నేర్చి
నన్, దరుణిరో వారకామినికి ధారుణిలో వివరించి చూపినన్.

చ. విను నీవుండినయంతగాలమును నే వేవేలు దెచ్చిచ్చినన్
ధననాథుం డరుదెంచెనేని పిలువం దథ్యంబు రమ్మంచు నన్
గొనుచు న్వచ్చిట నీవు ధనముల్ యాసించి పోఁజూచెదే(?)
మనువాడ న్నిను వారకాంతలకు సత్యం బెద్ది లోకంబునన్.

క. అతులనవరూపవిద్యా
చతురత్వము చూడవైతి జలజానన స
మ్మతి మీఱ ధనముఁ జూచితి
క్షితి వారాంగనల నెందుఁ జేరఁగఁ బాసెన్. 88

క. సుగుణ వనుకొందు మఱి నీ
సుగుణత్వము విడిచి జోగిఁ జూడఁగఁ జనుటే
సుగుణితన మెన్న నేటికి
సుగుణావతి సుగుణతనము చూచితి మిచటన్. 89

వ. అనిన విని మారుమాటాడం జాలక సుగుణావతి యూర
కుండిన నధికకోపావేశంబున లేచి సకలపాతకజాత యగు
లంజమాత యిట్లనియె. 90

ఉ. పల్లవకోటిచే సకలభాగ్యములుం గొనితెచ్చి పెట్టి యి
ల్లెల్లనుఁ బ్రోచుబిడ్డను మఱెక్కడ వెళ్లఁగ నీక కూడి రం

పిల్లఁగ మాయనేసి వలపించితి బాలకిఁ బిల్వవచ్చినన్
మల్లు లెసంగఁజూ చెదవు మానుష మే యిది మాకుఁజెప్పుమా.

ఉ. మందులమాయలన్ జెనటిమంత్రములందగఁగూర్చిభూమిలో
నెందఱెయొద్ద నీ భ్రమల నేర్పడఁ బెట్టితి వారు చాల రీ
సుందరి వెట్టిఁ గొల్పి యిలుచూఱగఁ దింటివి యీగిలేదు నీ
పొందులు గట్టిపెట్టి వెడపోకలు మాని తొలంగు వేగనన్.

చ. పటువగు నీదురూపమును బ్రాయము నేర్పును మేలు
విద్యలున్, సటవెట మాకు నేల మణిజాలములో కనకాంబ
రాదు లో, నటనలు నేసి పోయెదవు నాకడఁ జెల్లవు కట్టిపెట్టి
యీకటకట లంజపెట్టుభువిఁగల్గె యెఱుంగవుగాక యేమియున్

ఉ. పెట్టినవాఁడవో సతికిఁ బ్రేమతో సొమ్ములు చాలఁ దెచ్చి చే
పట్టినవాఁడవో పనులపట్టున నాపద లెల్ల మాన్చి ధీ
రట్టున కోడ వేమియును రా దోకపైకము చాలుఁజాలు నీ
పట్టువు దోతొలంగు విటపంతముగా దిట నుండ మిండఁడా!

వ. అని నిష్ఠురభాషణంబుల నతనిమనంబును దూరంబలికి
సుగుణావతి నచ్చోటువాపి సిద్ధునిసమ్ముఖంబునకుఁ దెచ్చె నట
మరుండును మనంబున లజ్జించి దాని యిల్లువెడలి తనలోన.

ఉ. ఎన్నడు లేనియింద్రుసభ కేటికిఁ బోయితిఁ బోయి యందులో
నున్నతబుద్ధినై కలసియుండఁగ నేరక వచ్చి యూరకే
కిన్నరనాథుతోడఁ దమకించి యదేల ప్రతిజ్ఞ సేయ నేఁ
డెన్నికమీఱ నాకమున కేగుట గాదు తలంచి చూచినన్.

క. ఇన్నియు నన నేఁటికి మఱి
పన్నగభూషణుని హరుని ఫాలాక్షుని న
త్యున్నతమతి సేవించెద
సన్నుతశివలోకవిభవసౌఖ్యము గల్గున్. 97

సీ. విషమలక్ష్యంబులై వినువీథిఁ జరియించు
త్రిపురంబులను సంహరించినాఁడు
భువనభీషణమహోద్భూతవిషానలమును
భక్షించి జగము రక్షించినాఁడు (?)
భయదోగ్రతరతీవ్రలయకాలమృత్యువు
నెఱియ రూపడగించి నిల్చినాఁడు
విధువిరించ్యాదులు వెదకి కానఁగ లేని
తత్త్వమై పొడవునఁ దనరినాఁడు
సురలు నసురలు సంయమీశ్వరులుఁ జేరి
కొలువ నన్నియుఁ దానయై వెలసినాఁడు
రూఢి శ్రీదక్షవాటీశ్వరుఁడు హరుండు
శాశ్వతోన్నతమూర్తి భీమేశ్వరుండు. 98

వ. అని తలపోసి సకలలోకాధీశ్వరుండు నగరు కేతెంచి యా దేవునకు సాష్టాంగదండప్రణామంబు లాచరించి హస్తంబులు మొగిడ్చి నిటలతటంబున ఘటియించి యిట్లనియె. 99

*దండకము. శ్రీమన్మహాదేవ దేవేంద్రసంస్తుత్య నిత్యానిరాకార నిశ్శంక ఓంకారతద్రూప దేవాద్రిచాపా మహాభక్త సల్లాప విధ్వస్తపాయా జయాటోపనీహార శైలేంద్రపుత్రీ ముఖాంభోజసప్తాశ్వ సర్వేశ్వరా దేవగంధర్వ గానా

* ఇది ముద్రితప్రతిలో లేదు.

మృతాలోల కారుణ్యసంశీల గంధేభచర్మాంబరా సర్వదర్వీక
రాధీశ కేయూరఃసృత్యాంకకోటీర కర్పూరసంకాశ ఆకాశ
కేశాయ యీశ మహోక్షాధిరూఢాయ విరూపాక్ష ధక్షా
ధ్వరాధ్యక్ష శిక్షానికాపేక్ష సద్భక్త సంరక్ష పద్మజనీరేజగ
ర్భామరవ్రాతమౌనీంద్రసంఘాత సంపూజితాంఘ్రి ద్వయో
పేత గంగానదీజూటసంఫుల్లలాలాట స్ఫురత్కోటిసూర్య
ప్రభా భాసురాకార శూలాయుధా భూతనాథ మహాదేవ
యుత్పత్తికిం గర్తవై రాజసం బొప్పఁగా బ్రహ్మవై సర్వలో
కాభిరక్షస్థితిం జాలి యాత్మైకభావంబునం బద్మనాభుండవై
సర్వసంహారక్రియా తామసస్ఫూర్తిచే మించి రుద్రుండవై
భూతాంతరవ్యాపివై నిండి బ్రహ్మాండహస్తాల్ వినోదంబుగా
మేనఁ బుట్టింప ద్రుంపన్ మదిం జాల విస్ఫూర్తిచే చంద్ర
సూర్యాగ్నివాతావనీ వ్యోమకాండాత్మ రమ్యాష్టమూర్తి
క్రియ న్మించి చిద్రూపమైయుండి నీరూప మేరూపముం గానఁ
గా లేక అధ్యాత్మవిద్యామహోల్లాసులై సంయమీంద్రుల్
మనఃపంకజాతంబుల న్నిన్ను భావించి సేవింతు రెల్లప్పుడున్
దేవ మీదివ్యతత్వస్వరూపంబు వర్ణింప శక్యుండనై కాల
కాలాంతక ఫాలనేత్ర భవత్పాదసేవాసమగ్రైకచిత్తుండనై
యుండ నాకుఁ బ్రసాదింపు దిగ్వాస కైలాసవాసా కృపావేశ
శ్రీదక్షవాటీపురాధీశ భీమేశ యీశా నమస్తే నమస్తే
నమస్తే నమః. 100

వ. ఇట్లని స్తుతియించిన. 101

సీ. ఇమ్మూడు వంకలయేరు సొంపులు మీఱ
జడలసందున నిండి కడలుకొనఁగఁ
జెలువంబు దళుకొత్తఁ జెరివిన తలపూవు
నెలకొని మొలక వెన్నెలలు చల్ల
జదలేటితనుగాటువులు గ్రోలెడవేయు (?)
చుంగులతలపాగ దొంగలింప
వడఁకుగుబ్బలిరాచవారిముద్దులపట్టి
పెరిమతో సామేన బిత్తరింప
చాలఁ జూపట్టె ముత్తెపుచాయ నఱురి
కెరలి యాడెడిరంకెల గిబ్బ నెక్కి
వేలుపులు చేరి కొలువంగ వేడ్క మించి
మొదలి వేలుపు వెడవిల్తుమ్రోల నిల్చె 102

క. ద్రాక్షారామపురాధిపుఁ
డక్షయుఁ డబ్జభవపంకజాక్షులతోఁ బుం
డ్రేక్షుశరాసనునకుఁ బ్ర
త్యక్షంబై నిలిచె దివిజు లందఱుఁ జూడన్. 103

వ. సిద్ధరూపంబు వన్ని దిక్పతులలో నున్నకుబేరుని కమ్మరునిం
జూపి యిట్లనిరి. 104

క. ధనమున నీ వధికుండవు
తను వగురూపమున శంబరాంతకుఁ డధికుం

డెనసిన వేడుక నిరువురు
వినుఁడు సమం బరసి చూడ విశ్వములోన HYDERABAD 105

రూపు లేకున్న జగములో రూఢి లేదు
ధనము లేకున్న మఱియు సంతకును గొఱత
వలయు రూపంబు ధనము నవశ్య మఖిల
మానవులకును సురలకు మాన కిపుడు. 106

అని మీలోపల మీకు విరోధంబు వలవదు. యథా పూర్వంబునఁ గూడియుండుం డని యిరువుర నొక్కటి చేసి వారలకు వలయుకోరికల నిచ్చి సర్వేశ్వరుఁ డంతర్ధానంబు నొందె. తనమూర్తి త్రిలింగాకారంబున భీమేశ్వరుఁడుగా వసియించి పూజలు గొనుచుండె. సకలదేవతలు యథా స్థానంబులకుం జనిరి. అందలి నారులు రూపధనాధిక్యంబుల మించి తొల్లిటియట్ల సుఖంబున నుండిరి. 107

వినయమున నీచరిత్రము
వినినం జదివినను మిగుల వేడుకతో వ్రా
సినవారి కెల్లఁ గలుగును
ఘనపుత్రవిశేషవిభవకామితఫలముల్. 108

కుంభీంద్రాసురవిక్రమక్రమపటుక్రూరారవాటోపసం
రంభప్రాభవభంజనోగ్రతరవీరస్ఫారకేళీభుజా
స్తంభస్తుత్య! సమస్తలోక మహితోద్యచ్చైత్యలకనాథిపా!
యంభోజప్రభవామరేంద్రనుతదాక్షారామభీమేశ్వరా! 109

క. కీలాలజసంభవగో
పాలార్చితపాదలోక ! పరమేశ్వర ! గో
పాలకసంసేవిత ! గో
పాలమహాదేవ ! రజతపర్వతసదనా. 110

స్రగ్విణి

మాలినీలోకార్చితామ్నాయ ! గంధర్వసం
దానదేవాద్రికోదండనీలాంబరా
దీనరత్నాకరా దివ్యతేజోమయా
దానవారిప్రియా దక్షవాటీశ్వరా.

గద్య. ఇది శ్రీ వీరభద్రకృపాలబ్ధకవితావిశేషమహితచారిత్ర
తిప్పయామాత్యపుత్ర నూతనకవిసూరయప్రణీతం బైన
సకలజనాభిరామం బగుధనాభిరామం బనుమహాకావ్యంబు
సర్వంబు తృతీయాశ్వాసము.

---

చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1950.

UNIVERSITY OF HYDERABAD
LIBRARY
TP HYDERABAD (A. P.)

Cl. No. 81 Acc. No. 29319

S477D DATE DUE

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

TP Acc. No. 29319

Call No. 81 SU77D

Author [illegible]

Title ధనాభిరామము

# UNIVERSITY OF HYDERABAD
## LIBRARY
### HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**